తెలంగాణ
TELANGANA MUCHATLU
ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
వరంగల్ | ఆదివారం-29-మార్చి-2026 | సంపుటి : 3 | సంచిక : 300 | పేజీలు : 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in



# మూసీ నది శుద్ధిపై ముఖ్యమంత్రి సంకల్పం

**మూసీ ప్రక్షాళనకు ప్రభుత్వ దీక్ష..**

**చారిత్రక పుణ్యక్షేత్రాల పునర్నిర్మాణానికి శ్రీకారం**

**పురాతన ఆలయాల అభివృద్ధికి భారీ ప్రణాళికలు**

**పర్యాటక, సాంస్కృతిక కేంద్రంగా మారనున్న పరీవాహక ప్రాంతం**



**హైదరాబాద్, మార్చి 28 (తెలంగాణ ముచ్చట్లు):**

ఎవరెన్ని విమర్శలు, అడ్డంకులు సృష్టించినా మూసీ నది ప్రక్షాళన పూర్తి చేసి తీరుతామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. మానవ తప్పిదాల వల్ల గొప్ప చరిత్ర కలిగిన హైదరాబాద్ నగరం కనుమరుగయ్యే ప్రమాదం నుంచి కాపాడి, భవిష్యత్తు తరాలకు అత్యద్భుత నగరాన్ని అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. మూసీ నది శుద్ధి ప్రస్తుతం అత్యవసరమైన అంశమని, దీనిపై ఎలాంటి రాజీ ఉండదని అన్నారు. మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్మెంట్ ప్రాజెక్టులో భాగంగా గండిపేటమంచిరేవుల ప్రాంతంలోని చారిత్రక వీరభద్ర స్వామి ప్రాంగణంలో శ్రీ మచిలేశ్వర స్వామి, శ్రీ ఓంకారేశ్వర స్వామి ఆలయాల పునర్నిర్మాణానికి ముఖ్యమంత్రి భూమిపూజ నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో గోవు పూజ చేసి గోశాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆలయాల అభివృద్ధికి సంబంధించిన పూజలు, శంకుస్థాపనలు ఘనంగా జరిగాయి.

మిగతా 2లో..



# ఎల్బీ స్టేడియంలో క్రీడల సందడి

**లెజిస్లేటర్స్ స్పోర్ట్స్ మీట్ ప్రారంభం**

**"ఫిట్ లీడర్స్ – ఫిట్ స్టేట్" సందేశంతో ఉత్సాహభరిత ప్రారంభం**

**14 ఏళ్ల తర్వాత పునఃప్రారంభమైన క్రీడా సంప్రదాయం**

**అంతర్జాతీయ ప్రమాణాలతో క్రీడా మౌలిక వసతుల అభివృద్ధికి ప్రణాళికలు**

**ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**

2లో



## సౌర శక్తి వినియోగానికి పిలుపు ఇచ్చిన బండి సంజయ్

ఇంటిపై సౌర ప్యానెల్స్ ఏర్పాటు

ప్రజాప్రతినిధులు ముందుండాలని సూచన

శక్తి స్వావలంబన లక్ష్యంగా కేంద్ర చర్యలు

**కరీంనగర్, మార్చి 28 (తెలంగాణ ముచ్చట్లు):**

కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు తన కరీంనగర్ నివాసంలో సౌర ప్యానెల్స్‌ను ఏర్పాటు చేశారు. పునర్విని యోగ శక్తి వినియోగాన్ని ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్రంలోని ప్రతి ప్రజాప్రతినిధి తమ ఇళ్లపై సౌర ప్యానెల్స్‌ను ఏర్పాటు చేసి ఆదర్శంగా నిలవాలని ఆయన పిలుపునిచ్చారు. వార్డు సభ్యులు, కార్పొరేటర్లు, సర్పంచ్‌ల నుండి అన్ని స్థాయిల నాయకులు ముందుండాలని సూచించారు. ప్రజల్లో అవగాహన పెంచడంలో ప్రజాప్రతినిధుల పాత్ర కీలకమని పేర్కొన్నారు.

మిగతా 2లో..

## ఆర్టీసీ సమస్యలపై ముఖాముఖి సమావేశం

కొత్త బస్సులు, రూట్లు, మౌలిక వసతులపై వినతులు

మహాలక్ష్మి పథకంతో పెరిగిన ప్రయాణికుల రద్దీ

అదిలాబాద్, కరీంనగర్, ఖమ్మం జిల్లాలపై ప్రత్యేక దృష్టి

పాల్గొన్న మంత్రులు పొన్నం, వివేక్



**హైదరాబాద్, మార్చి 28 (తెలంగాణ ముచ్చట్లు):**

రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ సేవల మెరుగుదలపై ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ఈ క్రమంలో రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లాల వారీగా ప్రజాప్రతినిధులతో ముఖాముఖి సమావేశాలు నిర్వహిస్తున్నారు. మూడో రోజు అదిలాబాద్, కరీంనగర్, ఖమ్మం జిల్లాలకు చెందిన ఎమ్మెల్యేలతో అసెంబ్లీ కమిటీ హాల్‌లో సమావేశం జరిగింది. మహాలక్ష్మి పథకం అమలుతో ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణికుల సంఖ్య గణనీయంగా పెరిగిన నేపథ్యంలో, నియోజకవర్గాల వారీగా అవసరమైన మౌలిక వసతులపై చర్చించారు.

మిగతా 2లో..

## అక్రమ మైనింగ్‌పై సీబీసీఐడీ విచారణకు ఆదేశాలు

హరీష్ రావు కుటుంబంపై ఆరోపణలు

పలువురు నేతలపై విచారణకు ప్రభుత్వం సిద్ధం

2014 నుంచి అక్రమాలపై సమగ్ర దర్యాప్తు

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**హైదరాబాద్, మార్చి 28 (తెలంగాణ ముచ్చట్లు):**



రాష్ట్రంలో అక్రమ మైనింగ్ వ్యవహారాలపై సీబీసీఐడీ ద్వారా సమగ్ర విచారణ జరపాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి శాసనసభ వేదికగా ప్రకటించారు. గత కొన్ని సంవత్సరాలుగా జరిగిన అక్రమ తవ్వకాలపై పూర్తి స్థాయిలో దర్యాప్తు చేపట్టి నిజాలను బయటకు తీసుకురావాలని ఆయన ఆదేశించారు.

మిగతా 2లో..


## రాఘవ కన్‌స్ట్రక్షన్స్‌పై ఆరోపణలు నిరాధారం: మంత్రి వివేక్

ఫీజులన్నీ చెల్లించిన సంస్థ అని స్పష్టం

కేంద్ర అనుమతుల కోసం దరఖాస్తు చేసిన కంపెనీ

వ్యక్తిగత ఆరోపణలపై మంత్రి ఆగ్రహం

**హైదరాబాద్, మార్చి 28 (తెలంగాణ ముచ్చట్లు):**



రాఘవ కన్‌స్ట్రక్షన్స్ సంస్థపై వస్తున్న ఆరోపణలను రాష్ట్ర మైనింగ్ శాఖ మంత్రి డా. గడ్డం వివేక్ ఖండించారు. శాసనసభలో మాట్లాడుతూ ఆ సంస్థ అన్ని చట్టబద్ధ ఫీజులను పూర్తిగా చెల్లించిందని స్పష్టం చేశారు. డిసెంబర్ నాటికి రాఘవ కన్‌స్ట్రక్షన్స్ సంస్థ పర్మిట్ ఫీజుగా రూ.1,22,25,446 చెల్లించిందని, అదనంగా సినరేజ్ ఫీజుగా రూ.1,52,97,825 ఇప్పటికే రాష్ట్ర ఖజానాకు జమ చేసిందని వివరించారు.

మిగతా 2లో..

## మిషన్ భగీరథపై బీఆర్ఎస్‌కు సీతక్క కౌంటర్

పనులు పూర్తి కాలేదని ఆరోపణ

నిధుల విషయంలో కేంద్రం ప్రశ్నలు

వేసవికి తాగునీటి సమస్యల నివారణకు చర్యలు

**హైదరాబాద్, మార్చి 28 (తెలంగాణ ముచ్చట్లు):**



మిషన్ భగీరథ అమలుపై బీఆర్ఎస్ పార్టీ ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నదని మంత్రి దానసరి సీతక్క ఆరోపించారు. పనులు పూర్తికాకపోయినా 100 శాతం పూర్తి చేశామని చెప్పడం ద్వారా కేంద్రం, రాష్ట్ర ప్రజలను మోసం చేశారని విమర్శించారు. మిషన్ భగీరథ ప్రాజెక్ట్ పూర్తిస్థాయిలో అమలు కాలేదని, గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రాజెక్ట్ నిర్వహణలో విఫలమైందని మంత్రి పేర్కొన్నారు.

మిగతా 2లో..

## జలమండలి లోగో దుర్వినియోగంపై కఠిన చర్యలు

ప్రైవేట్ ట్యాంకర్లపై క్రిమినల్ కేసులు నమోదు

ప్రజలను తప్పుదారి పట్టించే చర్యలపై హెచ్చరిక

అధికారిక సేవల ద్వారానే నీటి బుకింగ్ చేయాలని సూచన

**హైదరాబాద్, మార్చి 28 (తెలంగాణ ముచ్చట్లు):**

హైదరాబాద్ జలమండలి లోగోను అనధికారికంగా వినియోగిస్తున్న ప్రైవేట్ నీటి ట్యాంకర్ యజమానులపై కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. ఇటీవల కొందరు వ్యక్తులు జలమండలి అధికారిక గుర్తింపు చిహ్నాన్ని దుర్వినియోగం చేస్తున్నట్లు గుర్తించినట్లు తెలిపారు.

మిగతా 2లో..

TELANGANA MUCHATLU
తెలంగాణ ముచ్చట్లు
తెలుగు దిన పత్రిక

# ఎల్‌బీ స్టేడియంలో క్రీడల సందడి





**హైదరాబాద్, మార్చి 28 (తెలంగాణ ముచ్చట్లు):**
హైదరాబాద్ నడిబొడ్డున ఉన్న ఎల్‌బీ స్టేడియంలో "తెలంగాణ లెజిస్లేటర్స్ స్పోర్ట్స్, కల్చరల్ మీట్" తొలి ఎడిషన్ ఘనంగా ప్రారంభమైంది. "ఫిట్ లీడర్స్ - ఫిట్ స్టేట్" అనే సందేశంతో ప్రజాప్రతినిధులు పెద్దఎత్తున పాల్గొని క్రీడాస్ఫూర్తిని చాటారు.

బడ్జెట్ సమావేశాల సందర్భంగా శాసన మండలి, శాసనసభ సభ్యులకు నిర్వహించే ఈ క్రీడలు గత 14 సంవత్సరాలుగా నిలిచిపోయిన నేపథ్యంలో, ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి వాటిని మళ్లీ ప్రారంభించారు. కార్యక్రమాన్ని ప్రారంభించడమే కాకుండా సహచర మంత్రులు, ప్రజాప్రతినిధులతో కలిసి పలు క్రీడల్లో స్వయంగా పాల్గొని అందరిలో ఉత్సాహాన్ని నింపారు.

ఈ కార్యక్రమంలో శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో పాటు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ ఎల్‌బీ స్టేడియంకు గొప్ప చరిత్ర ఉందని, ప్రపంచ స్థాయి క్రీడాకారులు ఇక్కడ ఆడినట్టు గుర్తు చేశారు. ఈ స్టేడియాన్ని అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేస్తామని తెలిపారు. అలాగే గచ్చీబౌలి క్రీడా మైదానాలను రూ.700 కోట్లతో ప్రపంచ స్థాయి సదుపాయాలతో అభివృద్ధి చేయనున్నట్లు ప్రకటించారు. 2034 నాటికి ఒలింపిక్స్ నిర్వహించే దిశగా ప్రణాళికలు సిద్ధం చేసినట్లు ముఖ్యమంత్రి వెల్లడించారు. మూడు నెలల్లో పనులు ప్రారంభించి, వచ్చే మూడేళ్లలో గచ్చీబౌలిలో అన్ని క్రీడలను నిర్వహించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. బేగంపేట హాకీ మైదానాన్ని కూడా అభివృద్ధి చేస్తామని చెప్పారు.

తెలంగాణలో క్రీడలను పునరుద్ధరించేందుకు ప్రభుత్వం క్రీడా విధానాన్ని అమలు చేస్తోందని ముఖ్యమంత్రి తెలిపారు. గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు సీఎం కప్ పోటీలను నిర్వహిస్తూ యువతలో క్రీడాస్ఫూర్తిని పెంపొందిస్తున్నామని పేర్కొన్నారు. అంతర్జాతీయ స్థాయిలో రాణించేలా యువతను తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో భాగంగా పలు క్రీడాపోటీలు నిర్వహించగా, ముఖ్యమంత్రి స్వయంగా ఫుట్‌బాల్ మ్యాచ్‌లో పాల్గొని క్రీడాకారులను ప్రోత్సహించారు. మొత్తం కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో కొనసాగి, క్రీడల ప్రాముఖ్యతను మరోసారి గుర్తు చేసింది.

# జలమండలి లోగో దుర్వినియోగంపై కఠిన చర్యలు

(మొదటి పేజీ తరువాయి)

జలమండలి లోగో అనేది ప్రభుత్వ అధికారిక గుర్తింపు చిహ్నమని, దీనిని అనుమతి లేకుండా వినియోగించడం చట్ట విరుద్ధమని అధికారులు స్పష్టం చేశారు. ప్రైవేట్ ట్యాంకర్లు ఈ లోగోను ఉపయోగించడం వల్ల ప్రజలు వాటిని ప్రభుత్వ సేవలుగా భావించే పరిస్థితి ఏర్పడుతోందని తెలిపారు. ఇది మోసపూరిత చర్యగా పరిగణించబడుతుందని పేర్కొన్నారు. ప్రైవేట్ ట్యాంకర్ల ద్వారా సరఫరా అయ్యే నీరు సాధారణంగా బోర్‌వెల్‌ల నుంచి సేకరించబడుతుందని, అది జలమండలి ప్రమాణాల ప్రకారం శుద్ధి చేయబడినది కాదని అధికారులు తెలిపారు. ఈ నీటి నాణ్యతపై పరీక్షలు కూడా జరగకపోవడంతో ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని హెచ్చరించారు.

ప్రజలు తాగునీటి కోసం ట్యాంకర్లను బుక్ చేసుకునే సమయంలో అధికారిక మార్గాల ద్వారానే బుక్ చేసుకోవాలని సూచించారు. టోల్ ఫ్రీ నంబర్ 155313 ద్వారా మాత్రమే సురక్షితమైన, శుద్ధి చేయబడిన నీటిని పొందవచ్చని తెలిపారు. ఇటీవల నిర్వహించిన తనిఖీలలో ఒక ప్రైవేట్ ట్యాంకర్ జలమండలి లోగోను అనధికారికంగా వినియోగిస్తున్నట్లు గుర్తించి, ఆ ట్యాంకర్‌ను స్వాధీనం చేసుకుని సంబంధిత వ్యక్తిపై క్రిమినల్ కేసు నమోదు చేసినట్లు అధికారులు వెల్లడించారు.

ఈ విషయాన్ని అత్యంత సీరియస్‌గా తీసుకున్న ఎండీ అశోక్ రెడ్డి, లోగో దుర్వినియోగం ఎక్కడ జరిగినా వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండి ఇలాంటి ఘటనలను సంబంధిత అధికారులకు తెలియజేయాలని కోరారు. మొత్తంగా జలమండలి సేవలపై ప్రజల నమ్మకాన్ని కాపాడేందుకు, అక్రమ చర్యలను అరికట్టేందుకు కట్టుదిట్టమైన చర్యలు కొనసాగిస్తామని అధికారులు స్పష్టం చేశారు.

అసలు పనులు పూర్తి కాకపోయినా పూర్తి అయినట్లు చూపించడం వల్ల ప్రస్తుతం నిధుల కోసం కేంద్రాన్ని సంప్రదించినప్పుడు అనుమానాలు వ్యక్తమవుతున్నాయని తెలిపారు.

ప్రస్తుతం ప్రభుత్వం తాగునీటి అవసరాలను దృష్టిలో పెట్టుకుని అదనపు నిధులు కోరితే, కేంద్రం "ఇంకా ఎందుకు నిధులు?" అని ప్రశ్నిస్తున్నదని మంత్రి వెల్లడించారు. ఇది గత ప్రభుత్వ వైఫల్యాల ఫలితమని విమర్శించారు

ఇప్పటికీ మిషన్ భగీరథ పనులు కొనసాగుతున్నాయని, గతంలో జరిగిన లోపాలను సరిదిద్దే పనిలో ప్రభుత్వం ఉందని తెలిపారు. ప్రాజెక్ట్‌ను పూర్తిస్థాయిలో అమలు చేసి ప్రజలకు నిరంతర తాగునీరు అందించడమే లక్ష్యమని స్పష్టం చేశారు.

వేసవిలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని మంత్రి చెప్పారు. నీటి సరఫరా వ్యవస్థను మెరుగుపరచడం, అవసరమైన మౌలిక వసతులను బలోపేతం చేయడం వంటి చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. మొత్తంగా మిషన్ భగీరథపై వాస్తవాలను ప్రజలకు తెలియజేయడం అవసరమని మంత్రి పేర్కొన్నారు. ప్రజలను తప్పుదారి పట్టించే రాజకీయాలకు తావు లేకుండా పారదర్శకంగా పాలన సాగిస్తామని ఆమె స్పష్టం చేశారు.

# సౌర శక్తి వినియోగానికి పిలుపు ఇచ్చిన బండి సంజయ్

(మొదటి పేజీ తరువాయి)

సౌర శక్తి వినియోగం కేవలం విద్యుత్ బిల్లులు తగ్గించుకోవడమే కాకుండా, దేశాన్ని శక్తి పరంగా స్వావలంబన దిశగా తీసుకెళ్లే ముఖ్యమైన అడుగుగా ఆయన అభివర్ణించారు. దీని ద్వారా భారత్ ఎనర్జీ సెక్యూరిటీ సాధించగలదని అన్నారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన పీఎం సూర్య ఘర్ పథకం ద్వారా ఒక కోటి ఇళ్లలో సౌర విద్యుత్ ఏర్పాటు లక్ష్యంగా పెట్టుకున్నట్లు వివరించారు. ఈ పథకం కింద కుటుంబాలకు నెలకు 300 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ లభించే అవకాశం ఉందని తెలిపారు. అలాగే రూ.30 వేల నుండి రూ.78



వేల వరకు సబ్సిడీ అందించబడుతుందని, 80 శాతం వరకు రుణ సదుపాయం కూడా అందుబాటులో ఉందని పేర్కొన్నారు. ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలు కూడా సులభంగా సౌర ప్యానెల్స్ ఏర్పాటు చేసుకునేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని చెప్పారు. రూఫ్‌టాప్ సౌర ప్యానెల్స్ ఏర్పాటు ద్వారా విద్యుత్ బిల్లులు గణనీయంగా తగ్గుతాయని, భవిష్యత్తులో విద్యుత్ కొనుగోలు చేసే స్థితి నుంచి విక్రయించే స్థితికి ప్రజలు చేరుకుంటారని మంత్రి తెలిపారు. సౌర శక్తి భవిష్యత్తు అని, అందరూ దీని వినియోగాన్ని పెంచాలని పిలుపునిచ్చారు.

# మూసీ నది శుద్ధిపై ముఖ్యమంత్రి సంకల్పం

(మొదటి పేజీ తరువాయి)

సుమారు 1400 సంవత్సరాల చరిత్ర కలిగిన ఈ ఆలయాన్ని దాదాపు 8 ఎకరాల్లో రూ.700 కోట్ల వ్యయంతో అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కతో కలిసి ఈ పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో మాట్లాడుతూ మూసీ ప్రక్షాళనతో పాటు ఈ ప్రాంతాన్ని ధ్యానమందిరాలు, సాంస్కృతిక కట్టడాలతో ప్రత్యేక పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని వెల్లడించారు. మూసీ నది ప్రక్షాళనను ఏ పరిస్థితుల్లోనూ ఆపబోమని, ఇది ప్రభుత్వ దీక్ష అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్టు ద్వారా ఈ ప్రాంతాన్ని దక్షిణ కాశీగా అభివృద్ధి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. రామప్ప ఆలయ నమూనాలో నిర్మాణాలు చేపట్టాలని సంకల్పించామని, ఇది యాదృచ్ఛికంగా కాకుండా దైవ సంకల్పంతో జరుగుతున్న కార్యక్రమమని అన్నారు.

నదీ పరీవాహక ప్రాంతాలు అభివృద్ధికి కేంద్రబిందువులుగా మారుతాయని చరిత్ర చెబుతోందని, తెలంగాణకు సముద్రతీరం లేకపోయినా నదులను సమర్థంగా వినియోగించుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. దేశ రాజధాని ఢిల్లీలో యమునా నది కాలుష్యం వల్ల ఏర్పడిన సమస్యలను ఉదాహరణగా తీసుకుని, హైదరాబాద్‌లో అలాంటి పరిస్థితులు రాకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మూసీ ప్రక్షాళనతో పాటు నగరంలో మత సామరస్యాన్ని ప్రతిబింబించే నిర్మాణాలకు కూడా ప్రాధాన్యం ఇస్తున్నామని చెప్పారు. చార్మినార్ ప్రాంతంలో మసీదు, గౌలిగూడలో సిక్కు దేవాలయం, ఉప్పల్ ప్రాంతంలో చర్చి నిర్మాణాలు చేపట్టనున్నట్లు తెలిపారు. గోదావరి నుంచి నీటి సరఫరా ద్వారా నగర అవసరాలను తీర్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని, ప్రాజెక్టును అడ్డుకునే ప్రయత్నాలు చేయవద్దని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## అక్రమ మైనింగ్‌పై సీబీసీఐడీ విచారణకు ఆదేశాలు

(మొదటి పేజీ తరువాయి)

ఈ సందర్భంగా మాజీ మంత్రి హరీష్ రావు కుటుంబానికి చెందిన మైనింగ్ కార్యకలాపాలపై కూడా ఆరోపణలు వెలువడ్డాయి. ఆయన తమ్ముడు మహేష్ రావుకు సంబంధించిన మైనింగ్ కంపెనీపై సీబీసీఐడీ విచారణ జరుగనున్నట్లు తెలిపారు. అధికారంలో ఉన్న సమయంలో అక్రమంగా మైనింగ్ క్వారీల కేటాయింపులు జరిగాయన్న ఆరోపణలపై దర్యాప్తు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. అదే విధంగా సిరిసిల్ల ప్రాంతంలో ఇసుక మాఫియా కార్యకలాపాలపై కూడా విచారణ జరపనున్నట్లు ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఈ కేసులో సంతోష్ రావు, ఆయన తండ్రి రవీందర్ రావుపై వచ్చిన ఆరోపణలను పరిశీలించి, దళితుల ప్రాణనష్టానికి కారణమైన ఘటనలపై నిజాలు వెలికితీయాలని నిర్ణయించారు.

కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ కు సంబంధించిన ఇల్లీగల్ గ్రానైట్ మైనింగ్ అంశంపై కూడా విచారణకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. అక్రమ తవ్వకాల వల్ల ప్రభుత్వానికి, ప్రజలకు జరిగిన నష్టాన్ని అంచనా వేసే పనిని కూడా చేపట్టనున్నట్లు వెల్లడించారు. ఇక రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర కు చెందిన కంపెనీలపై కూడా విచారణ జరుగనున్నట్లు ప్రకటించారు. రాఘవ కన్స్ట్రక్షన్ సహా అనేక సంస్థలపై వచ్చిన ఆరోపణలను సీబీసీఐడీ సమగ్రంగా పరిశీలించనుంది. 2014 సంవత్సరం నుంచి ఇప్పటి వరకు జరిగిన అన్ని మైనింగ్ కార్యకలాపాలను పరిశీలించి, ఎవరెవరు అక్రమంగా తవ్వకాలు నిర్వహించారో నిగ్గు తేలుస్తామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. అక్రమాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## రాఘవ కన్‌స్ట్రక్షన్స్‌పై ఆరోపణలు నిరాధారం: మంత్రి వివేక్

(మొదటి పేజీ తరువాయి)

ఈ లావాదేవీల ద్వారా ప్రభుత్వానికి ఎటువంటి నష్టం జరగలేదని మంత్రి తెలిపారు. మైనింగ్ రంగంలో సాధారణంగా కేంద్ర ప్రభుత్వ పర్యావరణ అనుమతులు అవసరమని, అందుకు అన్ని సంస్థలు వేచి చూస్తుంటాయని మంత్రి పేర్కొన్నారు. రాఘవ కన్స్ట్రక్షన్స్ కూడా అదే విధంగా కేంద్ర అనుమతుల కోసం దరఖాస్తు చేసుకున్నదని తెలిపారు. ఈ నేపథ్యంలో కొన్ని రాజకీయ నాయకులు చేస్తున్న ఆరోపణలు వాస్తవాలకు విరుద్ధమని మంత్రి విమర్శించారు. ముఖ్యంగా మాజీ మంత్రి హరీష్ రావు ఉద్దేశపూర్వకంగా వ్యక్తిగత ఆరోపణలు చేస్తున్నారని ఆరోపించారు. రాజకీయ ప్రయోజనాల కోసం నిజాలను వక్రీకరించడం సరైన పద్ధతి కాదని మంత్రి అన్నారు. ప్రజల ముందు వాస్తవాలను ఉంచడం ప్రభుత్వ బాధ్యత అని స్పష్టం చేశారు. మొత్తంగా రాఘవ కన్స్ట్రక్షన్స్ సంస్థ కార్యకలాపాలు చట్టబద్ధంగా సాగుతున్నాయని, ఎటువంటి అక్రమాలు లేవని ప్రభుత్వం తరఫున మంత్రి మరోసారి స్పష్టం చేశారు.

## మిషన్ భగీరథపై బీఆర్ఎస్‌కు సీతక్క కౌంటర్

(మొదటి పేజీ తరువాయి)

అసలు పనులు పూర్తి కాకపోయినా పూర్తి అయినట్లు చూపించడం వల్ల ప్రస్తుతం నిధుల కోసం కేంద్రాన్ని సంప్రదించినప్పుడు అనుమానాలు వ్యక్తమవుతున్నాయని తెలిపారు.

ప్రస్తుతం ప్రభుత్వం తాగునీటి అవసరాలను దృష్టిలో పెట్టుకుని అదనపు నిధులు కోరితే, కేంద్రం "ఇంకా ఎందుకు నిధులు?" అని ప్రశ్నిస్తున్నదని మంత్రి వెల్లడించారు. ఇది గత ప్రభుత్వ వైఫల్యాల ఫలితమని విమర్శించారు

ఇప్పటికీ మిషన్ భగీరథ పనులు కొనసాగుతున్నాయని, గతంలో జరిగిన లోపాలను సరిదిద్దే పనిలో ప్రభుత్వం ఉందని తెలిపారు. ప్రాజెక్ట్‌ను పూర్తిస్థాయిలో అమలు చేసి ప్రజలకు నిరంతర తాగునీరు అందించడమే లక్ష్యమని స్పష్టం చేశారు.

వేసవిలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని మంత్రి చెప్పారు. నీటి సరఫరా వ్యవస్థను మెరుగుపరచడం, అవసరమైన మౌలిక వసతులను బలోపేతం చేయడం వంటి చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. మొత్తంగా మిషన్ భగీరథపై వాస్తవాలను ప్రజలకు తెలియజేయడం అవసరమని మంత్రి పేర్కొన్నారు. ప్రజలను తప్పుదారి పట్టించే రాజకీయాలకు తావు లేకుండా పారదర్శకంగా పాలన సాగిస్తామని ఆమె స్పష్టం చేశారు.

## ఆర్టీసీ సమస్యలపై ముఖాముఖి సమావేశం

(మొదటి పేజీ తరువాయి)

కొత్త బస్సులు, కొత్త రూట్లు, బస్ స్టేషన్‌ల అభివృద్ధి, బస్ హాల్టింగ్ సదుపాయాలు, డిపోలు, టాయిలెట్ల నిర్మాణం వంటి అంశాలపై ఎమ్మెల్యేలు వినతిపత్రాలు సమర్పించారు. ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని ప్రతి నియోజకవర్గానికి తగిన సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. ప్రత్యేకంగా గ్రామీణ, దూర ప్రాంతాల్లో రవాణా సౌకర్యాలు మెరుగుపర్చాలని ఎమ్మెల్యేలు సూచించారు. ఈ సందర్భంగా చెన్నూరు నియోజకవర్గంలో బస్ స్టేషన్ అభివృద్ధి, కొత్త రూట్లలో బస్సులు నడిపించాలని మంత్రి వివేక్ వెంకటస్వామి సూచించారు. సింగరేణి ప్రాంతంలో కార్మికులకు ఇబ్బందులు లేకుండా పాత రూట్లతో పాటు అదనపు రూట్లు కూడా ప్రవేశపెట్టాలని కోరారు.

సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గాల్లో ఉన్న సమస్యలను వివరించి, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఆర్టీసీ సేవలను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు.

ఈ సమావేశంలో ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి, ఇతర ఉన్నతాధికారులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు. రాష్ట్రంలో రవాణా సౌకర్యాలను మెరుగుపరచి ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
ఆదివారం - 29- మార్చి 2026




## ముష్టిబండలో కామ్రేడ్ రావి వీర వెంకయ్య వర్ధంతి

- సీపీఎం ఆధ్వర్యంలో నివాళులు
- పార్టీ జెండా ఆవిష్కరణ, పూలమాలలతో ఘన స్మరణ.
- పేదల కోసం జీవితాంతం పోరాడిన మహానేత: పుల్లయ్య

**దమ్మపేట, మార్చి 28(తెలంగాణ ముచ్చట్లు):** దమ్మపేట మండల పరిధిలోని ముష్టిబండ గ్రామంలో అమరజీవి కామ్రేడ్ రావి వీర వెంకయ్య 34వ వర్ధంతి కార్యక్రమాన్ని సీపీఎం పార్టీ ఘనంగా నిర్వహించింది. కార్యక్రమానికి ముష్టిబండ శాఖ కార్యదర్శి కొలిక్కి పోగు శ్రీనివాస్ రావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వెంకయ్య స్మారక స్థూపం వద్ద సీపీఎం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కొక్కెర పార్టీ పుల్లయ్య పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం వెంకయ్య చిత్రపటానికి మాజీ జిల్లా కమిటీ సభ్యుడు దొడ్డా లక్ష్మి నారాయణ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. తరువాత జరిగిన వర్ధంతి సభలో మాట్లాడిన పుల్లయ్య, రావి వీర వెంకయ్య జీవితాంతం మార్క్సిస్టు సిద్ధాంతాలకు కట్టుబడి పేదలు, కార్మికులు, రైతుల కోసం పోరాడిన మహానేత అని పేర్కొన్నారు. జమీందారులు, జాగీర్దారులు, పెత్తందారుల దౌర్జన్యాలను ధైర్యంగా ఎదిరించి ప్రజల మధ్యే ఉండి సేవలందించారని కొనియాడారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో, ముఖ్యంగా సత్తుపల్లి నియోజకవర్గంలో పార్టీ అభివృద్ధికి వెంకయ్య విశేష కృషి చేశారని తెలిపారు. తాను పుట్టిన ముష్టబండ గ్రామంలో పార్టీ బలోపేతానికి ఎనలేని సేవలు అందించారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో దమ్మపేట మండల కార్యదర్శి మొరంపూడి శ్రీనివాసరావు, పార్టీ నాయకులు అనిల్ కుమార్, హెచ్. మల్లేశ్వరరావు, రావి వీర వెంకట కుమార్, జగన్నాధపు శ్రీనివాసరావు, చీకటి వెంకట లక్ష్మీనారాయణ, గ్రామ పెద్దలు కూకలకుంట సత్యనారాయణ, కూకలకుంట చిట్టి రావు, కూకలకుంట భద్రయ్య, జోనెబోయిన శ్రీనివాసరావు, బసవ శ్రీనివాసరావు, జగపతి లక్ష్మీనారాయణ, ఉడుతనేని రవి తదితరులు పాల్గొన్నారు.

## నవ తెలంగాణ రాష్ట్రవికలాంగుల ఫోరం జిల్లా అధ్యక్షునిగా ఇప్ప. శ్రీకాంత్

**కాజీపేట్ మార్చి 28 (తెలంగాణ ముచ్చట్లు)**



నవ తెలంగాణ రాష్ట్ర వికలాంగుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు ఎండి. అజీమ్ ఆధ్వర్యంలో శనివారం హనుమకొండలో ఏర్పాటు చేసిన సమావేశంలో హనుమకొండ జిల్లాకు చెందిన శ్రీకాంత్ ను హనుమకొండజిల్లా అధ్యక్షునిగా నియమిస్తున్నట్టు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా అజీమ్ మాట్లాడుతూ ఇప్ప. శ్రీకాంత్ గత పది సంవత్సరాల నుండి హనుమకొండ జిల్లాలో ని దివ్యాంగుల తోపాటు ఇతర ప్రజలకు కూడా ఏ సమస్య వచ్చినా అండగా ఉండి సహాయ సహకారాలు అందిచి అనేక సేవా కార్యక్రమాలు ఆయన చేస్తున్నారని పేర్కొన్నారు. శ్రీకాంత్ చేస్తున్న సేవలను గుర్తించి జిల్లా అధ్యక్షునిగా నియమించడం జరిగిందని అజీజ్ తెలిపారు. శ్రీకాంత్ సంఘ నియమ నిబంధనలు పాటిస్తూ ఎలాంటి అవినీతి, అక్రమాలకు పాల్పడకుండా స్వచ్ఛందంగా దివ్యాంగులకు సహాయ సహకారాలు అందించాలని వారి సమస్యలను పరిష్కరించుటలో ముందంజలో ఉండాలని ఆయన కోరారు ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు మండల వేణుగోపాల్ రాష్ట్ర సహాయక కార్యదర్శి బండారి మహేందర్ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు బండి చక్రపాణి వరంగల్ జిల్లా అధ్యక్షుడు గై సతీష్ ప్రధాన కార్యదర్శి బత్తిని రాజు ఉపాధ్యక్షుడు వేల్పుల ప్రభాకర్ కార్యదర్శి ఎండి సాదిక్ క్రాంతి భరత్, రాజ్ భరత్, సమ్మడి మధు, ఎండి బిలాల్ మొదలగువారు పాల్గొన్నారు.



## బేతుపల్లి అంకమ్మ తిరునాళ్లకు ఘన ఏర్పాట్లు

- వచ్చే నెల 2, 3 తేదీల్లో మహోత్సవాలు
- మంత్రి తుమ్మల చేత బ్రోచర్ల ఆవిష్కరణ

**సత్తుపల్లి, మార్చి 28(తెలంగాణ ముచ్చట్లు):** బేతుపల్లి గ్రామం అంకమ్మ తిరునాళ్ల మహోత్సవాల సందడి ముందుగానే మొదలైంది. ఈ సందర్భంగా దమ్మపేట మండల పరిధిలోని గండుగులపల్లి గ్రామంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చేత మహోత్సవ బ్రోచర్లను ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా ఆవిష్కరించారు. వచ్చే నెల 2, 3 తేదీల్లో జరగనున్న అంకమ్మ తిరునాళ్లను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ మహోత్సవానికి ప్రాంతం నలుమూలల నుండి భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉందని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మంత్రి తుమ్మల నాగేశ్వరరావును కలిసి మహోత్సవాలకు విచ్చేసి ఆశీర్వదించాలని ఆహ్వానించారు. మంత్రి కూడా తిరునాళ్లను విజయవంతంగా నిర్వహించాలని ఆకాంక్షించారు. మంత్రి తుమ్మలను కలిసిన వారిలో చల్లగుళ్ల లోకేశ్వరరావు, అజయ్ బాబు, రాము, కొప్పుల శ్రీనివాసరావు, కొప్పుల సాంబశివరావు, కొప్పుల అపూర్ నాథ్ తదితరులు, ఆలయ కమిటీ సభ్యులు, బేతుపల్లి గ్రామ పెద్దలు పాల్గొన్నారు. సత్తుపల్లి మండల పరిధిలోని బేతుపల్లి గ్రామంలో అంకమ్మ తిరునాళ్ల మహోత్సవం ప్రతి సంవత్సరం భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించడం విశేషం. ఈ వేడుకలు ప్రాంతీయ సాంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తూ భక్తులను ఆకట్టుకుంటున్నాయి.

## సాయిస్ఫూర్తి ఆటానమస్ ఇంజనీరింగ్ కళాశాలలో అంతర్జాతీయ సదస్సు



**సత్తుపల్లి, మార్చి 28 (తెలంగాణ ముచ్చట్లు):** స్థానిక మండల పరిధిలోని బి గంగారం గ్రామం సాయిస్ఫూర్తి ఆటానమస్ ఇంజనీరింగ్ కళాశాలలో "రిసెంట్ ట్రెండ్స్ ఇన్ ఇంజనీరింగ్ & మేనేజ్‌మెంట్ సైన్స్" పై మూడవ అంతర్జాతీయ సదస్సు (ఐసీఆర్‌టీఈఎం-2026) శనివారం కళాశాల కాన్ఫరెన్స్ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల సెక్రటరీ & కరస్పాండెంట్ దాసరి ప్రభాకర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఇంజనీరింగ్ మరియు మేనేజ్‌మెంట్ సైన్స్ రంగాలలో జరుగుతున్న తాజా పరిణామాలను ప్రపంచవ్యాప్తంగా ఉన్న పరిశోధకులు, విద్యావేత్తలు, పరిశ్రమ నిపుణులు ఒకే వేదికపై చర్చించేందుకు ఈ సదస్సు ఒక గొప్ప అవకాశమని తెలిపారు. ఐసీఆర్‌టీఈఎం-2026 సదస్సు ద్వారా వినూత్న పరిశోధనలు, అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలు, సమకాలీన సవాళ్లపై చర్చలు జరగడంతో పాటు విద్యాసంస్థలు-పరిశ్రమల మధ్య సహకారం పెరుగుతుందని పేర్కొన్నారు. ఈ సదస్సులో ముఖ్య వక్తలుగా కాఠ్మండు విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ బిజినెస్ మేనేజ్‌మెంట్‌కు చెందిన అజయ్ కుమార్ షా, ఒమాన్‌లోని యూనివర్సిటీ ఆఫ్ టెక్నాలజీ అండ్ అప్లైడ్ సైన్సెస్‌కు చెందిన డాక్టర్ మొహెద్ అక్బర్ పాల్గొన్నారు. వారు సాంకేతిక మరియు నిర్వహణ రంగాల్లో ఆధునిక ఆవిష్కరణలు, కొత్త విధానాలు, ఆచరణాత్మక పరిష్కారాల పై తమ అభిప్రాయాలను వెల్లడించారు. కీలకోపన్యాసాలు, సాంకేతిక పత్రాల సమర్పణలు, ప్యానెల్ చర్చలు, ఇంటరాక్టివ్ సెషన్లు ఈ సదస్సులో ప్రధాన ఆకర్షణలుగా నిలిచాయి. పాల్గొన్నవారు ప్రస్తుత పరిశోధన ధోరణులు, పరిశ్రమల పద్ధతులు, భవిష్యత్ అవకాశాలపై విలువైన అవగాహన పొందారు. ఈ కార్యక్రమానికి చీఫ్ ప్యాట్రన్‌గా హెటిరో ఫార్మాస్యూటికల్ సంస్థ అధినేత, రాజ్యసభ సభ్యుడు, కళాశాల చైర్మన్ బండి పార్థసారథి రెడ్డి, ప్యాట్రన్‌గా విపాసన ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ట్రస్టీ బండి అన్విద, ప్రోగ్రాం చైర్ & కన్వీనర్‌గా ప్రిన్సిపాల్ డాక్టర్ వూటుకూరి శేషారత్నకుమారి, కోకన్వీనర్‌గా డాక్టర్ తోటకూర వీరన్న (ఏఐ & ఎంఎల్, ఏఐ & డీఎస్ విభాగాధిపతి), ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఆర్. రంజిత్ కుమార్ (డి3 సొల్యూషన్స్ మేనేజింగ్ పార్టనర్) వ్యవహరించారు. పండితులు, నిపుణులు, విద్యార్థులు ఈ సదస్సులో పాల్గొని జ్ఞానాన్ని పెంపొందించుకోవాలని నిర్వాహకులు ఆహ్వానించారు.

## నారాయణ స్కూల్లో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే సంబరాలు

**వనపర్తి, మార్చి28(తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి జిల్లా కేంద్రంలోని నారాయణ స్కూల్లో ప్రీ ప్రైమరీ, ప్రైమరీ విద్యను పూర్తిచేసుకున్న విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ డే సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల నిర్వాహక బృందం విద్యార్థులకు నియామక పత్రాలు, మెడల్స్ అందజేసి అభినందించింది. కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ బయందర్ మాట్లాడుతూ.. విద్యార్థి జీవితంలో ఈ వేడుకలు ఒక ముఖ్యమైన మైలురాయని, ఇటువంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్లు రీనగుప్త, మాధురి, వైస్ ప్రిన్సిపాల్ రవళి, షర్మిక, ఏవో శంకర్ రెడ్డి, ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.










## వేలేరు మండల బీఆర్ఎస్ పార్టీ నూతన కన్వీనర్ గా కొయ్యడ మహేందర్

**వేలేరు, మార్చ్ 28 (తెలంగాణ ముచ్చట్లు):** ఈరోజు బిఅర్ఎస్ పార్టీ వేలేరు మండల కన్వీనర్‌గా నియమితులైన సందర్భంగా కొయ్యడ మహేందర్ తెలంగాణ రాష్ట్ర తొలి ఉప ముఖ్య మంత్రి, స్టేషన్ ఘనపూర్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య ను హన్మకొండ లోని వారి స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది.డాక్టర్ తాటికొండ రాజయ్య స్పందిస్తూ ,మండలంలో పార్టీని అభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళ్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. పార్టీ శ్రేణులతో సమన్వయం చేసుకుంటూ ప్రజలకు సేవ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీలు, మాజీ మండల అధ్యక్షుడు ఆయా గ్రామ శాఖ అధ్యక్షులు,సర్పంచ్ లు,ఉప సర్పంచ్ లు,మండల మాజీ ప్రజా ప్రతినిధులు, ముఖ్యనాయకులు,తదితరులు పాల్గొన్నారు.

## 100% సబ్సిడీతో కూరగాయల విత్తనాల పంపిణీ

**వేలేరు, మార్చ్ 28 (తెలంగాణ ముచ్చట్లు):** వేలేరు మండల కేంద్రంలోని రైతు వేదికలో హార్టికల్చర్ శాఖ ఆధ్వర్యంలో రైతులకు 100% సబ్సిడీతో కూరగాయల విత్తనాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు, వేలేరు మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ మీ బిల్లా యాదగిరి పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల అభివృద్ధి కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్ లో అధిక నిధులను కేటాయిస్తున్నదని తెలిపారు. అలాగే ఎమ్మెల్యే కడియం శ్రీహరి సహకారంతో మండలంలో రైతులకు సబ్సిడీ యంత్రాలు అందుతున్నాయని చెప్పారు. ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం సుమారు 130 మంది రైతులకు రూ.1.50 లక్షల విలువైన కూరగాయల విత్తనాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హార్టికల్చర్ శాఖ అధికారులు, రైతులు పాల్గొన్నారు.



## ముల్కనూరులో మల్లికార్జున స్వామి దేవాలయ ప్రతిష్ఠ మహోత్సవాలు

**ముల్కనూరు, మార్చి 28 (తెలంగాణ ముచ్చట్లు)**



హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ముల్కనూరు గ్రామంలో శ్రీ పరాభవ నామ సంవత్సరం వైశాఖ శుద్ధ పౌర్ణమి సందర్భంగా భారీ ధార్మిక కార్యక్రమాలకు గ్రామస్తులు సన్నాహాలు చేస్తున్నారు. గ్రామంలోని శ్రీ మల్లికార్జున స్వామి ఆలయంతో పాటు బలిజమేడలమ్మ, గొల్లకేతమ్మ దేవతల విగ్రహాలు, శివలింగం, గణపతి, సుబ్రహ్మణ్య స్వామి, శ్రీ రాధాకృష్ణ స్వామి , అభయాంజనేయ స్వామి విగ్రహాలు, ధ్వజస్తంభం మరియు నవగ్రహాల ప్రతిష్ఠ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నారు.

ఈ మహోత్సవాలు 2026 మే 1వ తేదీ శుక్రవారం నుండి ప్రారంభమై మే 3వ తేదీ ఆదివారం వరకు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమాల్లో భాగంగా మే 3వ తేదీ ఉదయం 8 గంటల 14 నిమిషాలకు వృషభ లగ్న సుముహూర్తంలో ప్రతిష్ఠ కార్యక్రమం శాస్త్రోక్తంగా నిర్వహించబడుతుంది.

ఈ ప్రతిష్ఠ మహోత్సవాన్ని వేదమూర్తులు, బ్రాహ్మణులు శాస్త్రోక్త విధానంలో నిర్వహించనున్నారు. గ్రామ పెద్దలు మరియు యాదవ కులస్తుల, గ్రామంకు చెందిన అన్ని కులములను,దేవాలయ నిర్మాణంకు సహకరించిన దాతలను కలుపుకొని ఇట్టి ప్రతిష్ఠాపన మహోత్సవ కార్యక్రమాలు చేపడుతున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

మహోత్సవాలకు భక్తులు భారీ సంఖ్యలో హాజరై స్వామివారి ఆశీస్సులు పొందాలని గ్రామ పెద్దలు కోరారు.

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్: బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



# బాధలో అండగా నిలిచిన సద్దాం హుస్సేన్

**వేలేరు, మార్చ్ 28 (తెలంగాణ ముచ్చట్లు):**

వేలేరు మండల 10వ వార్డుకు చెందిన సార శ్రీనివాస్ మరణంతో ఆ కుటుంబం తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో చిక్కుకుంది. ఈ క్లిష్ట సమయంలో మాజీ ఉపసర్పంచ్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు సద్దాం హుస్సేన్ ముందుకొచ్చి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.వెంటనే 50 కిలోల బియ్యం అందజేసి, తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ప్రజల మధ్యే ఉండి సేవ చేయడం ద్వారా నిజమైన నాయకత్వం చూపిస్తున్నారని స్థానికులు అభినందించారు. ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులు, యువకులు మరియు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.




# ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ లో మల్లారం చిన్నారి 'ప్రాజ్ఞాత్మిక' సత్తా

**భీమదేవరపల్లి, మార్చి28(తెలంగాణ ముచ్చట్లు):** మల్లారంకు చెందిన పెద్ది హరి కృష్ణ, శిరీష దంపతుల ఐదేళ్ల కుమార్తె 'పెద్ది ప్రాజ్ఞాత్మిక' ప్రతిష్టాత్మక 'ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్'లో చోటు దక్కించుకుని 'ఐబీఆర్ అచీవర్'గా నిలిచింది. కేవలం 52 సెకన్ల వ్యవధిలోనే భారత దేశంలోని 39 నగరాల మారుపేర్లను (Nicknames) అనర్గళంగా చెప్పి ఈ అరుదైన రికార్డును నెలకొల్పింది. చిన్న వయసులోనే అసాధారణ జ్ఞాపకశక్తితో జాతీయ స్థాయి రికార్డును సొంతం చేసుకున్న ప్రాజ్ఞాత్మికను చూసి తల్లిదండ్రులు ఎంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు. చిన్నారి ప్రతిభపై బంధువులు, స్థానికులు ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు.

# గుర్తుతెలియని వాహనం ఢీకొని వృద్ధురాలి మృతి

**కాజీపేట్ మార్చి 28 (తెలంగాణ ముచ్చట్లు)**

మడికొండ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న టేకులగూడెం గ్రామంలోని ఓ ఆర్ ఆర్ మీద ఈనెల 26న గుర్తుతెలియని వాహనం ఢీ కొట్టడంతో గుర్తుతెలియని వృద్ధురాలు చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మృతురాలి వయసు సుమారు 60 నుండి 65 సంవత్సరాల కలిగి బిక్షాటన చేసుకునేల ఉందనీ ఆమె మానసిక పరిస్థితి సరిగ్గా లేనట్లుగా ఉందని వారు తెలిపారు.



ఆక్సిడెంట్ జరిగిన వెంటనే స్థానికులు 108కు సమాచారం ఇయ్యగా ఆమెను ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు ఆమె చికిత్స పొందుతూ చనిపోయిందని పోలీసులు తెలిపారు. వృద్ధురాలు నైటీ ధరించందని ఎవరైనా ఆమెను గుర్తుపట్టిన ఆమెకు సంబంధించిన వివరాలు తెలిస్తే 871 26 85 009 లేదా 871 2685248 లేదా 8712685123 ఫోన్ నంబర్లకు లకు తెలుపగలరని వారు కోరారు.

# కెఎల్‌బి ఐఐహెచ్‌టిలో డిప్లొమా ప్రవేశాలు ప్రారంభం

- 10వ తరగతి అర్హతతో అవకాశం
- నెలకు రూ.2,500 స్టైపెండ్
- కలెక్టర్ మను చౌదరి పిలుపు

**మేడ్చల్–మల్కాజ్గిరి, మార్చి 28 (తెలంగాణ ముచ్చట్లు):** హైదరాబాద్‌లోని కొండా లక్ష్మణ్ బాపూజీ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ (కెఎల్‌బి ఐఐహెచ్‌టి)లో 202627 విద్యా సంవత్సరానికి డిప్లొమా కోర్సుల ప్రవేశాలు ప్రారంభమయ్యాయని మేడ్చల్-మల్కాజ్గిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ ప్రభుత్వ చేనేత మరియు జౌళి శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న ఈ సంస్థలో చేనేత, వస్త్ర సాంకేతికతలో ప్రత్యేక కోర్సులు అందిస్తున్నట్లు పేర్కొన్నారు.మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు అభ్యర్థులు పదవ తరగతి లేదా తత్సమాన పరీక్షలో ఉత్తీర్ణులై ఉండాలని, ఇంగ్లీష్ ఒక సబ్జెక్ట్‌గా ఉండాలని తెలిపారు. ప్రవేశాలు పూర్తిగా 10వ తరగతి మార్కుల ఆధారంగా మెరిట్ ప్రకారం జరుగుతాయని వెల్లడించారు. తెలంగాణ ప్రభుత్వ రిజర్వేషన్ విధానం అమలులో ఉంటుందని చెప్పారు.అభ్యర్థుల గరిష్ఠ వయస్సు 23 సంవత్సరాలు కాగా, ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులకు 25 సంవత్సరాల వరకు సడలింపు ఉంటుందని తెలిపారు. ఈ వయోపరిమితి 2026 జూలై 16 నాటికి వర్తిస్తుందని పేర్కొన్నారు. ఆ తరువాత సిబిఎస్ఈ మరియు ఇతర బోర్డుల విద్యార్థులు తమ మార్కుల ధృవీకరణ పత్రాలను దరఖాస్తుతో సమర్పించాలని సూచించారు.అలాగే గణితం, భౌతిక శాస్త్రం, రసాయన శాస్త్రంతో 10+2 ఉత్తీర్ణులైన వారికి రెండో సంవత్సరంలో లేటరల్ ఎంట్రీ ద్వారా ప్రవేశం కల్పిస్తారని చెప్పారు. కోర్సులో చేరిన ప్రతి విద్యార్థికి మూడు సంవత్సరాల పాటు నెలకు రూ.2,500 స్టైపెండ్‌ను తెలంగాణ ప్రభుత్వం అందిస్తుందని కలెక్టర్ వివరించారు.అర్హులైన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ మను చౌదరి సూచించారు.





# బోయిన్పల్లి మార్కెట్ యార్డ్ డంప్ యార్డ్‌గా మారింది

- చెత్త తొలగింపు నిలిచిపోవడంతో దుర్వాసన
- వ్యాపారాలకు దెబ్బ సమస్య పరిష్కారం వరకు ధర్నా కొనసాగుతుందన్న హెచ్చరిక

**మేడ్చల్ మల్కాజ్గిరి, మార్చ్ 28 (తెలంగాణ ముచ్చట్లు):** బోయిన్పల్లి మార్కెట్ యార్డ్‌లో పారిశుధ్య సమస్యలు తీవ్రమవుతున్నాయి. రోజుకు దాదాపు పదివేల మంది కస్టమర్లు వచ్చే ఈ మార్కెట్‌లో గత తొమ్మిది నెలలుగా చెత్త తొలగింపు నిలిచిపోవడంతో వందల లారీల చెత్త పేరుకుపోయింది. చెత్తను తరలించే కాంట్రాక్టర్లు, టాయిలెట్ల శుభ్రత నిర్వహించే కార్మికులకు చెల్లింపులు లేకపోవడం ఇందుకు ప్రధాన కారణంగా వ్యాపారులు చెబుతున్నారు.కుళ్లిపోయిన కూరగాయల నుంచి వెలువడుతున్న దుర్వాసనతో పాటు మురుగు నీరు మార్కెట్ అంతటా వ్యాపించడంతో కస్టమర్లు రావడం తగ్గిపోయింది. ఫలితంగా వ్యాపారాలు తీవ్రంగా దెబ్బతిన్నాయని వ్యాపార వర్గాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. మార్కెట్‌లో ప్రాథమిక సదుపాయాల పరిస్థితి కూడా దారుణంగా ఉంది. మహిళల టాయిలెట్లలో నీరు లేకపోవడం, తలుపులు లేకపోవడం వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని మహిళలు తెలిపారు. అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ సరిగా పనిచేయకపోవడం, తాగునీటి కొరత సమస్యను మరింత తీవ్రతరం చేస్తోంది. అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినప్పటికీ శాశ్వత పరిష్కారం లభించలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారుల పర్యటనల ముందు మాత్రమే తాత్కాలిక చర్యలు తీసుకుంటున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి.ఈ నేపథ్యంలో ఒక మహిళా నాయకురాలు మార్కెట్ యార్డ్‌లో ధర్నాకు దిగుతూ, సమస్య పూర్తిగా పరిష్కారం అయ్యే వరకు అక్కడి నుంచి వెళ్లబోనని ప్రకటించారు. చెత్తను పూర్తిగా తొలగించడం, డ్రైనేజీ వ్యవస్థను పునరుద్ధరించడం, తాగునీటి సదుపాయాలు మెరుగుపరచడం, బయోగ్యాస్ ప్లాంట్‌ను తిరిగి ప్రారంభించడం వంటి డిమాండ్లు ఆమె ముందుంచారు.అవసరమైతే మార్కెట్ యార్డ్‌ను తాత్కాలికంగా మూసివేసి పూర్తిస్థాయి శుభ్రత చర్యలు చేపట్టాలని కూడా డిమాండ్ చేశారు. అధికారులు వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించకపోతే ఆందోళనను మరింత ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు.

# ఈసీఐఎల్ ట్రేడ్ యూనియన్ నేత ఆర్.డి. ఇమ్మానియేల్ కన్నుమూత

- గుండెపోటుతో తుదిశ్వాస..
- కార్మిక హక్కుల కోసం జీవితాంతం సేవలు

**నాగారం, మార్చి 28 (తెలంగాణ ముచ్చట్లు)**

ఈసీఐఎల్ పరిశ్రమలో ట్రేడ్ యూనియన్ సీనియర్ నాయకుడు, కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) సానుభూతిపరుడు ఆర్.డి. ఇమ్మానియేల్ (72) శనివారం తెల్లవారుజామున గుండెపోటుతో కన్నుమూశారు. నాగారం దత్తాత్రేయ నగర్‌లోని తన నివాసంలో ఉదయం 2.30 గంటల సమయంలో ఆయన మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.ఇమ్మానియేల్‌కు భార్యతో పాటు ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. ఈసీఐఎల్‌లో అనేక సంవత్సరాల పాటు ట్రేడ్ యూనియన్ కార్యకలాపాల్లో చురుకుగా పాల్గొన్న ఆయన, కార్మికుల సమస్యల పరిష్కారంలో కీలక పాత్ర పోషించారు. ఓటమి ఎరుగని నాయకుడిగా పేరు తెచ్చుకున్న ఆయన, కన్జ్యూమర్ కోఆపరేటివ్ సొసైటీ సెక్రటరీగా పనిచేసి కార్మిక సంక్షేమానికి విశేష కృషి చేశారు.ఆయన మృదుస్వభావి, అందరితో కలిసిమెలిసి ఉండే నాయకుడని ఈసీఐఎల్ మాజీ అధ్యక్షుడు గొడుగు యాదగిరిరావు పేర్కొన్నారు. ఇమ్మానియేల్ మృతి పట్ల ఈసీఐఎల్ అధికారులు, సహచరులు, కాలనీ వాసులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. పలువురు నాయకులు, సహచరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. బొమ్మగాని సోమయ్య, జి. శివ రామకృష్ణ, రవీంద్రనాథ్, హెచ్.వి. స్వామి, నాగారం యాదయ్య, వెంకటేశ్వర్లు, దయాసాగర్, సిహెచ్. ప్రసాద్, సత్తిరెడ్డి, ధనరాజ్, నరసింహ, రామారావు తదితరులు ఆయనకు చివరి నివాళులు అర్పించారు.ఆయన అంత్యక్రియలు బోయిగూడ లో నిర్వహించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.



R D Emmanuel

# డ్రైనేజీ పనులను పరిశీలించిన శాంతి సాయిజెన్

- లెవెల్ లోపంతో పైప్‌లైన్ తొలగింపు...
- మళ్లీ సరైన విధంగా పనుల ప్రారంభం

**నాచారం, మర్చి 28 (తెలంగాణ ముచ్చట్లు)**

ఉప్పల్ నియోజకవర్గం నాచారం సర్కిల్ భవాని నగర్‌లో కొనసాగుతున్న భూగర్భ డ్రైనేజీ నిర్మాణ పనులను మాజీ కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్ పరిశీలించారు. గత కొద్దిరోజులుగా వివిధ కారణాల వల్ల నిలిచిపోయిన ఈ పనులను పునఃప్రారంభించేందుకు ఆమె అధికారులతో కలిసి ప్రాంతాన్ని సందర్శించారు.పరిశీలనలో భాగంగా డ్రైనేజీ లెవెల్ సరిగా లేకపోవడం వల్ల మురుగునీరు రివర్స్ వచ్చే ప్రమాదం ఉన్నట్లు గుర్తించారు. దీంతో వెంటనే చర్యలు తీసుకుంటూ రోడ్ నెంబర్ 3లో సుమారు 100 మీటర్ల మేర వేసిన పైప్‌లైన్‌ను తొలగించి, కొత్త లెవెల్ ప్రకారం మళ్లీ ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా శాంతి మాట్లాడుతూ, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా నాణ్యమైన పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా ఉంటే కాలనీలో పరిశుభ్రత, ఆరోగ్య పరిస్థితులు మెరుగుపడతాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు మోహన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి మధుసూదన్ రెడ్డి, కృష్ణారెడ్డి, కట్ట బుచ్చన్న గౌడ్, చంద్రశేఖర్, సాయిజెన్ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



# మల్కాజిగిరి బార్ అసోసియేషన్ కమిటీ సభ్యులకు ఘన సన్మానం

- అడ్వకేట్ అజయ్ కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో కార్యక్రమం

**కుషాయిగూడ, మార్చి 28 (తెలంగాణ ముచ్చట్లు):**

మల్కాజిగిరి జిల్లా బార్ అసోసియేషన్ ఎన్నికల్లో విజయం సాధించిన కమిటీ సభ్యులకు కుషాయిగూడలో ఘన సన్మానం నిర్వహించారు. అడ్వకేట్ పి. అజయ్ కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో ఆయన కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో సభ్యులను శాలువాలతో సత్కరించారు.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు టి. రత్నయ్య, ఉపాధ్యక్షురాలు ప్రసన్న కుమారి, ప్రధాన కార్యదర్శి ఎస్. దుర్గా ప్రసాద్ యాదవ్ మాట్లాడారు. జిల్లా కోర్టులో న్యాయవాదులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని తెలిపారు.కోర్టు సముదాయ భవనం అభివృద్ధి, జూనియర్ న్యాయవాదుల సమస్యల పరిష్కారం, ప్రజలకు న్యాయ అవగాహన కల్పించడం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తామని చెప్పారు. అదేవిధంగా కోర్టు వ్యవస్థ, కేసుల పరిష్కారం వంటి అంశాలపై సదస్సులు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు ఎం. హరికృష్ణ, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రటరీ బి.ఎస్. పవన్ కుమార్‌తో పాటు పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.



# ఆశా వర్కర్ల అక్రమ అరెస్టులు ఖండన

- హైదరాబాద్ ధర్నాకు వెళ్తుండగా నిర్బంధం
- ఉద్యమం ఆగదని హెచ్చరిక

**మేడ్చల్–మల్కాజిగిరి, మార్చి 28 (తెలంగాణ ముచ్చట్లు):** మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో ఆశా వర్కర్లు “చలో హైదరాబాద్” ధర్నాకు వెళ్తుండగా పోలీసులు అక్రమ అరెస్టులకు పాల్పడిన ఘటనపై కార్మిక సంఘాల నేతలు తీవ్రంగా స్పందించారు. కుషాయిగూడ, మల్కాజిగిరి, బాలానగర్, సూరారం, షాపూర్‌నగర్, కీసర, జవహర్‌నగర్, షామీర్పేట్, ఉప్పల్, అల్వాల్, మేడ్చల్ ప్రాంతాల్లో వందలాది ఆశా వర్కర్లను అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్లకు తరలించినట్లు ఆరోపించారు.సీఐటీయూ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సహాయ కార్యదర్శి కె. ఉన్ని కృష్ణన్ మాట్లాడుతూ, మహిళలను








రాత్రి సమయంలో అరెస్టు చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని విమర్శించారు. ప్రజాపాలన పేరుతో ప్రభుత్వం నిర్బంధ పాలన కొనసాగిస్తోందని అన్నారు.తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఎం. రేవతి కళ్యాణి మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో ఆశా వర్కర్లకు ఫిక్స్డ్ వేతనం రూ.18,000తో పాటు ఈఎస్ఐ, పీఎఫ్ వంటి సౌకర్యాలు కల్పిస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం, ఇప్పుడు వారి న్యాయమైన డిమాండ్లను అణచివేయడానికి అరెస్టులకు దిగిందని ఆరోపించారు.అక్రమ అరెస్టులతో ఉద్యమాలను అణచివేయలేమని, వెంటనే నిర్బంధంలో ఉన్న ఆశా వర్కర్లను విడుదల చేసి వారి సమస్యలను పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
తెలుగు దిన పత్రిక
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్

# ఉపాధ్యాయ వృత్తి గొప్పది

- శంకర్ గౌడ్, సాహితి కళావేదిక అధ్యక్షులు

**వనపర్తి,మార్చి 28(తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి జిల్లా కోస్గి మండలం బిజ్వరం ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా 37 సంవత్సరాల పాటు సేవలందించిన నామ్‌దేవ్ విరమణ సందర్భంగా శనివారం ఘనంగా వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి సాహితి కళావేదిక జిల్లా అధ్యక్షుడు శంకర్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా శంకర్ గౌడ్ మాట్లాడుతూ, అన్నీ వృత్తులకన్నా ఉపాధ్యాయ వృత్తి గొప్పదని పేర్కొన్నారు.నామ్‌దేవ్ తమ సేవా కాలంలో విద్యార్థుల భవిష్యత్తు నిర్మాణంలో కీలక పాత్ర పోషించారని కొనియాడారు.విరమణ అనంతరం కూడా సమాజ సేవలో చురుకుగా పాల్గొనాలని సూచించారు .ఈ కార్యక్రమంలో సభాధ్యక్షుడిగా ప్రభాకర్ వ్యవహరించగా, సముదాయం ప్రధానోపాధ్యాయుడు శేఖరయ్య, గ్రామ సర్పంచ్, వివిధ ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు, నామ్‌దేవ్ బాల్య స్నేహితులు కెసి వెంకటేష్, రాములు, నరేష్, రాంనాయక్, రాజలింగం, మనేపు రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే ఉపాధ్యాయ సంఘాల నాయకులు, పాఠశాల చైర్మన్, రాములమ్మ, ఉపాధ్యాయులు, కుటుంబ సభ్యులు, మండల ఉపాధ్యాయులు, మిత్రులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.



# విఘ్నేశ్వర స్వామి దేవస్థానంలో హుండీ లెక్కింపు పారదర్శకంగా

**జమ్మికుంట టౌన్ మార్చ్ 28 (తెలంగాణ ముచ్చట్లు):** జమ్మికుంటలోని శ్రీ విఘ్నేశ్వర స్వామి దేవస్థానంలో హుండీ లెక్కింపు కార్యక్రమం పారదర్శకంగా నిర్వహించారు. జిల్లా దేవాలయ పరిశీలకులు సత్యనారాయణ, ఈవో సుధాకర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ ప్రక్రియలో అధికారులు క్రమబద్ధంగా లెక్కింపు చేపట్టారు. ఈ సందర్భంగా హుండీ ద్వారా మొత్తం రూ.94,788 ఆదాయం వచ్చినట్లు వెల్లడించారు. భక్తులు విశ్వాసంతో సమర్పించిన కానుకలు దేవస్థాన అభివృద్ధికి తోడ్పడుతున్నాయని అధికారులు పేర్కొన్నారు. భక్తుల భక్తి, సహకారం అభినందనీయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో అర్చకులు, దేవస్థాన సిబ్బంది పాల్గొని లెక్కింపును విజయవంతంగా పూర్తి చేశారు.

# ఏప్రిల్ 1 నుంచి కొత్త ట్రాఫిక్ నిబంధనలు

- భారీ వాహనాలపై మల్కాజిగిరి పోలీసుల ఉక్కుపాదం
- పీక్ అవర్స్‌లో నో-ఎంట్రీ
- ఫ్లైఓవర్లపై 24 గంటల నిషేధం
- భారీ జరిమానాలు, చట్టపరమైన చర్యలు

**మల్కాజిగిరి, మార్చి 28 (తెలంగాణ ముచ్చట్లు):** నగరంలో రోజురోజుకీ పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీని తగ్గించడంతో పాటు పాదచారుల భద్రతను మెరుగుపరచేందుకు మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్ కీలక నిర్ణయం తీసుకుంది. కమిషనరేట్ పరిధిలో భారీ (హెచ్ఎంవి), మధ్యతరహా (హెచ్ఎంవి) వాహనాల రాకపోకలపై కఠిన ఆంక్షలు విధిస్తూ కొత్త నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నిబంధనలు ఏప్రిల్ 1, 2026 నుంచి అమల్లోకి రానున్నాయి. ట్రాఫిక్ రద్దీ ఎక్కువగా ఉండే పీక్ అవర్స్‌లో భారీ వాహనాల ప్రవేశాన్ని పూర్తిగా నిషేధించారు. ఉదయం 7:30 నుంచి 11:30 వరకు, సాయంత్రం 3:30 నుంచి రాత్రి 10:30 వరకు ఈ వాహనాలకు నో ఎంట్రీ ఉంటుంది. మధ్యాహ్నం 11:30 నుంచి 3:30 వరకు మరియు రాత్రి 10:30 నుంచి ఉదయం 7:30 వరకు మాత్రమే వీటికి అనుమతి ఉంటుంది. డీసీఎంలు, ఐషర్ వ్యాన్లు, వాటర్ ట్యాంకర్లు, రెడీమిక్స్ కాంక్రీట్ వాహనాలు, లారీలు, జేసీబీలు, ట్రాక్టర్లు మరియు ప్రైవేట్ బస్సులపై ఈ ఆంక్షలు వర్తిస్తాయి. అయితే టిజి ఆర్టిసి బస్సులు, స్కూల్ బస్సులు, అంబులెన్సులు, ఫైర్ ఇంజన్లు వంటి అత్యవసర సేవల వాహనాలకు పూర్తి మినహాయింపు ఇచ్చారు.ట్రాఫిక్ సాఫీగా ఉండేందుకు కొన్ని కీలక ఫ్లైఓవర్లపై 24 గంటల పాటు సరుకు రవాణా వాహనాలు మరియు 10 సీట్లకు పైగా ప్రయాణీకుల వాహనాల రాకపోకలను పూర్తిగా నిషేధించారు. పీఎన్టీ, సీటీఓ, వైఎంసీఏ ఫ్లైఓవర్లతో పాటు బైరామల్‌గూడ 1వ, 2వ లెవల్ ఫ్లైఓవర్లు ఈ జాబితాలో ఉన్నాయి. అల్వాల్, తిరుమలగిరి, బేగంపేట, గోపాలపురం, మల్కాజిగిరి, నేరెడ్‌మెట్, ఎల్బీ నగర్, సరూర్ నగర్, ఉప్పల్, కుషాయిగూడ ప్రాంతాల్లోని ప్రధాన రహదారులపై ఈ నిబంధనలు అమల్లోకి రానున్నాయి. అత్యవసర పరిస్థితుల్లో నిషేధిత సమయాల్లో వాహనాలు నడపాల్సి వచ్చినట్లయితే, ముందుగా ట్రాఫిక్ డీసీపీ నుంచి రాతపూర్వక అనుమతి తీసుకోవాలని పోలీసులు సూచించారు.నిబంధనలు ఉల్లంఘించే వారిపై భారీ జరిమానాలు విధించడంతో పాటు చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.నగరవాసుల ప్రయాణాన్ని సులభతరం చేయడమే ఈ నిర్ణయాల ఉద్దేశమని, వాహనదారులు సహకరించాలని మల్కాజిగిరి పోలీస్ శాఖ విజ్ఞప్తి చేసింది.

# మాదిగల ఐక్యతతోనే సామాజిక పురోగతి సాధ్యం

- ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్

**వనపర్తి,మార్చి28(తెలంగాణ ముచ్చట్లు):** మాదిగల ఐక్య వేదిక వనపర్తి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మాదిగ కులానికి చెందిన ప్రజా ప్రతినిధులకు ఘన సన్మాన కార్యక్రమం దాచ సులోచన కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డాక్టర్ కదిరే కృష్ణ, మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సిములు, ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్, అచ్చంపేట మాజీ శాసనసభ్యుడు గువ్వల బాలరాజు తదితరులు హాజరై ప్రసంగించారు.జిల్లా వ్యాప్తంగా ఉన్న మాదిగ సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, కౌన్సిలర్‌లను ఈ సందర్భంగా ఘనంగా సన్మానించారు.ప్రజలకు సేవ చేస్తున్న ప్రజా




ప్రతినిధులను గౌరవించడం ద్వారా సమాజానికి గౌరవం పెరుగుతుందని నాయకులు పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ.. మాదిగలు ఐక్యతతో ముందుకు సాగితేనే సామాజికంగా, రాజకీయంగా మరింత పురోగతి సాధ్యమవుతుందని అన్నారు. ప్రతి ఒక్కరూ చైతన్యంతో పనిచేసి సమాజ అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.డాక్టర్ కదిరే కృష్ణ మాట్లాడుతూ, చదువుతోనే సమాజంలో ఎదగగలమని, అందువల్ల ప్రతి ఒక్కరూ విద్యకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. గెలుపొందిన సర్పంచ్‌లు ఆత్మగౌరవంతో ప్రజలకు మంచి పాలన అందిస్తూ, తమ పదవీకాలంలో సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని పేర్కొన్నారు .ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, సామాజిక కార్యకర్తలు, మాదిగల ఐక్య వేదిక సభ్యులు పెద్దింటి వెంకటేష్, గంధం పరంజ్యోతి, మంద రాములు, మీసాల రాము, చిట్యాల తిరుపతి, వడ్డేమాన్ రవి, దారపోగు నాగరాజు, రాజనగరం రాజేష్, గంధం ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# వావిలాలలో మెగా వైద్య శిబిరం.. 200 మందికి పైగా లబ్ధి

**జమ్మికుంట టౌన్ మార్చ్ 28 (తెలంగాణ ముచ్చట్లు):**

జమ్మికుంట మండలం వావిలాల గ్రామంలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరం ప్రజలకు ఆశాజ్యోతి అయింది. గ్రామ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సర్పంచ్ కొండ అర్జున్ శిబిరాన్ని ప్రారంభించగా, మొదటి నుంచే గ్రామస్తులు పెద్ద సంఖ్యలో హాజరై సేవలు పొందారు.

ఈ శిబిరంలో ఆరు విభాగాలకు చెందిన వైద్య నిపునులు పాల్గొని ప్రజల ఆరోగ్యాన్ని పరీక్షించి తగిన చికిత్సలు అందించారు. సాధారణ వ్యాధుల నుంచి దీర్ఘకాలిక సమస్యల వరకు పరీక్షలు చేసి, అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. మొత్తం 200 మందికి పైగా ప్రజలు ఈ సేవలను వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ కొండ అర్జున్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజల ఆరోగ్య పరిరక్షణకు చేపడుతున్న ఇటువంటి కార్యక్రమాలను అందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇలాంటి శిబిరాలు ప్రజలకు ఎంతో ఉపయుక్తమని పేర్కొన్నారు.

కార్యక్రమంలో డాక్టర్ అరుణ, వైద్య సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొని శిబిరం విజయవంతం కావడానికి సహకరించారు. గ్రామ ప్రజలు కూడా ఇలాంటి కార్యక్రమాలు తరచుగా నిర్వహించాలని కోరుతున్నారు.







# సిర్సపల్లి డంపింగ్ యార్డ్ వివాదం

## మహిళల నిరసనల వెనుక పర్యావరణ–ఆరోగ్య ఆందోళనలు

**హుజురాబాద్ టౌన్ మార్చ్ 28 (తెలంగాణ ముచ్చట్లు):** హుజురాబాద్ శివారులోని సిర్సపల్లిలో ప్రతిపాదిత డంపింగ్ యార్డ్ వివాదం క్రమంగా సామాజిక, పర్యావరణ, రాజకీయ అంశాల సమ్మిళిత సమస్యగా మారుతోంది. శనివారం అంబేద్కర్ చౌరస్తా వద్ద గ్రామ మహిళల ఆధ్వర్యంలో కొనసాగుతున్న నిరసన దీక్ష ఆరో రోజుకు చేరుకోవడం ఈ సమస్యపై స్థానిక స్థాయిలో పెరుగుతున్న ఆందోళనను స్పష్టంగా చూపిస్తోంది.

మహిళలు ముందుండి ఆందోళన చేయడం గమనార్హం. ఇది కేవలం భూమి లేదా ప్రాజెక్ట్ వ్యతిరేకత మాత్రమే కాకుండా, కుటుంబ ఆరోగ్యం, తాగునీరు, పాడిపంటల భవిష్యత్తుపై ఉన్న భయాలను ప్రతిబింబిస్తుంది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో మహిళలే నీటి వినియోగం, కుటుంబ ఆరోగ్య పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తారు. అందువల్ల వారి ఆందోళనకు సామాజిక ప్రాధాన్యత మరింత పెరుగుతోంది.

పర్యావరణ పరంగా చూస్తే, డంపింగ్ యార్డులు సరైన శాస్త్రీయ విధానాలు పాటించకపోతే గాలి, నీటి కాలుష్యానికి దారితీసే ప్రమాదం ఉంది. మహిళలు పేర్కొన్నట్టు 15 కిలోమీటర్ల పరిధిలో విషవాయువుల వ్యాప్తి అన్నది సాంకేతికంగా అతిశయోక్తి కావచ్చు గానీ, దుర్వాసన, లీచేట్ (చెత్త నుండి వెలువడే ద్రవాలు) వల్ల భూగర్భజలాలు కలుషితం కావడం వంటి సమస్యలు నిజంగా సంభవించే అవకాశాలు ఉన్నాయి. ఇక వ్యవసాయంపై ప్రభావం కూడా కీలకం. సిర్సపల్లి పరిసర ప్రాంతాలు వ్యవసాయాధారితంగా ఉండటంతో, భూమి, నీరు కలుషితమైతే రైతులకు దీర్ఘకాలిక నష్టం కలగవచ్చు. ఇది కేవలం స్థానిక సమస్య కాకుండా ఆర్థికంగా కూడా ప్రభావం చూపే అంశం.

ఇదే సమయంలో, పట్టణ అభివృద్ధి కోసం చెత్త నిర్వహణ అవసరం కూడా అనివార్యం. పెరుగుతున్న పట్టణ జనాభాతో వ్యర్థాల నిర్వహణకు స్థలాలు అవసరం అవుతున్నాయి. అయితే, ప్రజల అనుమతి లేకుండా లేదా సరైన పర్యావరణ భద్రతా చర్యలు లేకుండా ఇలాంటి ప్రాజెక్టులను అమలు చేయడం ప్రతిఘటనకు దారితీస్తోంది. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం, స్థానిక ప్రజల మధ్య సమన్వయం అత్యవసరం. పర్యావరణ ప్రభావ అంచనాలు (ఇఐఏ ), ప్రజాభిప్రాయం సేకరణ, శాస్త్రీయంగా సురక్షితమైన వ్యర్థ నిర్వహణ విధానాలపై స్పష్టత ఇవ్వడం ద్వారా మాత్రమే ఈ వివాదానికి పరిష్కారం దొరకవచ్చు. లేకపోతే సిర్సపల్లి నిరసనలు మరింత విస్తరించే అవకాశాలు కనిపిస్తున్నాయి.






# జాతీయ లోక్ అదాలత్ విజయవంతం

- 81,078 కేసులకు పరిష్కారం
- రూ.34.54 లక్షల పరిహారం

**కుషాయిగూడ, మార్చి 28 (తెలంగాణ ముచ్చట్లు):** జాతీయ న్యాయ సేవాధికార సంస్థ, న్యూఢిల్లీ మరియు తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, మల్కాజిగిరి ఆధ్వర్యంలోకు మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కోర్టు ఆవరణలో శనివారం జాతీయ లోక్ అదాలత్‌ను ఘనంగా నిర్వహించారు.

ఈ లోక్ అదాలత్‌ను జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ వి. బాల భాస్కర్ రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి సత్తు రవీందర్ మాట్లాడుతూ, లోక్ అదాలత్ ద్వారా రాజీ పడదగిన కేసులను సులభంగా, వేగంగా పరిష్కరించుకోవచ్చని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన 25 బెంచ్‌లలో మొత్తం 81,078 కేసులు పరిష్కరించబడ్డాయి. ఇందులో 39 సివిల్ కేసులు, 81,007 క్రిమినల్ కేసులు ఉన్నాయి. అదనంగా బ్యాంకులు, బిఎస్ఎన్ఎల్‌కు సంబంధించిన 32 ప్రీలిటిగేషన్ కేసులు కూడా పరిష్కారం పొందాయి.ఈ లోక్ అదాలత్ ద్వారా మొత్తం రూ.34,54,988 పరిహారం చెల్లించబడినట్లు అధికారులు వెల్లడించారు.ఈ కార్యక్రమంలో మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి బి. తిరుపతి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రత్నయ్య, ఇతర న్యాయమూర్తులు, న్యాయవాదులు, పోలీసు సిబ్బంది, బ్యాంకులు, బిఎస్ఎన్ఎల్ సిబ్బంది పాల్గొన్నారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# యువతి అదృశ్యం.. కేసు నమోదు

**వేలేరు, మార్చ్ 28 (తెలంగాణ ముచ్చట్లు):** వేలేరు మండలం శాలపల్లె గ్రామానికి చెందిన ఓ యువతి కనిపించకుండా పోయిన ఘటన కలకలం రేపుతోంది. పోలీసుల వివరాల ప్రకారం, కూరపాటి రవీందర్ కుమార్తె రాధిక (17) పని మీద వేలేరు గ్రామానికి వెళ్తానని చెప్పి వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. కుటుంబ సభ్యులు ఎక్కడ వెతికినా ఆచూకీ లభించకపోవడంతో వేలేరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



# ఎల్‌పీజీ బుకింగ్ పేరుతో సైబర్ మోసాలు..

**న్యూఢిల్లీ, మార్చి 28 (తెలంగాణ ముచ్చట్లు):** దేశంలో ఎల్‌పీజీ సిలిండర్ బుకింగ్ పేరుతో పెరుగుతున్న సైబర్ మోసాలపై కేంద్ర ప్రభుత్వం కీలక హెచ్చరిక జారీ చేసింది. గ్యాస్ బుకింగ్, సబ్సిడీ అప్‌డేట్ లేదా కేవైసీ పేరుతో కేటుగాళ్లు అమాయక వినియోగదారులను లక్ష్యంగా చేసుకుంటున్నారని అధికారులు వెల్లడించారు. ఫేక్ వెబ్‌సైట్లు, వాట్సాప్ లింకులు, నకిలీ ఫోన్ కాల్స్ ద్వారా ఈ మోసాలు జరుగుతున్నాయని గుర్తించారు. గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధులమని నమ్మిస్తూ వినియోగదారులను సంప్రదించి, సిలిండర్ డెలివరీ లేదా అకౌంట్ యాక్టివేషన్ పేరుతో ఓటీపీలు అడుగుతున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయి. ఇలా సేకరించిన వ్యక్తిగత వివరాలు, బ్యాంక్ సమాచారం ఆధారంగా ఖాతాల నుంచి డబ్బులు కాజేస్తున్నారు. ఇంకా కొందరు నేరగాళ్లు తక్కువ ధరకే గ్యాస్ సిలిండర్లు అందిస్తామని నమ్మించి, నకిలీ యాప్‌లు (APK ఫైల్స్) డౌన్‌లోడ్ చేయిస్తుండటం మరింత ప్రమాదకరంగా మారింది. ఈ యాప్‌ల ద్వారా మొబైల్ ఫోన్లను హ్యాక్ చేసి, వినియోగదారుల డేటాను దుర్వినియోగం చేస్తున్నట్లు కేంద్రం తెలిపింది. ఈ నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వం సూచించింది. ఎట్టి పరిస్థితుల్లోనూ తెలియని వ్యక్తులకు బ్యాంక్ వివరాలు, ఓటీపీలు ఇవ్వకూడదని హెచ్చరించింది. అధికారిక గ్యాస్ సంస్థలు ఫోన్ ద్వారా ఓటీపీలు అడగవని స్పష్టం చేసింది. గ్యాస్ బుకింగ్ కోసం ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసీఎల్), హిందుస్థాన్ పెట్రోలియం (హెచ్‌పీ), భారత్ పెట్రోలియం (బీపీసీఎల్) వంటి సంస్థల అధికారిక యాప్‌లు లేదా వెబ్‌సైట్లను మాత్రమే ఉపయోగించాలని సూచించింది. అనుమానాస్పద లింకులపై క్లిక్ చేయవద్దని, మోసానికి గురైతే వెంటనే 1930 హెల్ప్‌లైన్ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని కేంద్రం కోరింది.

మొత్తానికి, డిజిటల్ సేవలు పెరుగుతున్న నేపథ్యంలో సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండడం అత్యంత అవసరమని అధికారులు సూచిస్తున్నారు.




# తనిఖీలు లేవు నిబంధనలు లేవు ఇదే పరిస్థితి

**ఎల్కతుర్తి, మార్చి 28: (తెలంగాణ ముచ్చట్లు)** హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండల కేంద్రంలో ఆహార భద్రతపై తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. మండలంలోని పలు హోటళ్లు, బేకరీలు నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా నిర్వహిస్తున్నాయని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. సరైన పదార్థాలు ఉపయోగించకుండా తయారుచేసే ఆహార పదార్థాలు ప్రజల ఆరోగ్యానికి ముప్పుగా మారుతున్నాయని వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ముఖ్యంగా కొన్ని హోటళ్లలో పరిశుభ్రత లోపించడం, పాత పదార్థాలను మళ్లీ వినియోగించడం వంటి ఘటనలు వెలుగులోకి వస్తున్నాయని సమాచారం. బేకరీలలో తయారయ్యే పదార్థాలు నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా లేవని పలువురు వినియోగదారులు చెబుతున్నారు. ఇటీవల కొందరు వినియోగదారులు ఆహారం తీసుకున్న తర్వాత అస్వస్థతకు గురైనట్లు కూడా స్థానికంగా చర్చ జరుగుతోంది.

అయితే, ఈ పరిస్థితులపై ఫుడ్ సేఫ్టీ అధికారులు స్పందించకపోవడం పట్ల ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మండలంలో తనిఖీలు నిర్వహించడం లేదని, నిబంధనలు అమలు కావడం లేదని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. స్థానిక ప్రజాప్రతినిధులు కూడా ఈ అంశంపై దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

ఇక కొందరు సామాజిక కార్యకర్తలు స్వచ్ఛందంగా హోటళ్ల పరిస్థితులను పరిశీలించి సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయాలని యోచిస్తున్నట్లు సమాచారం. అవసరమైతే కలెక్టరేట్‌ను ఆశ్రయించి పెద్ద ఎత్తున వినతిపత్రాలు సమర్పించేందుకు కూడా సిద్ధమవుతున్నారు.

ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి, ఎల్కతుర్తి మండలంలోని హోటళ్లు, బేకరీలపై సమగ్ర తనిఖీలు చేపట్టి నాణ్యతా ప్రమాణాలు పాటించని వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. లేకపోతే పెద్ద ఎత్తున నిరసనలు చేపట్టాల్సి వస్తుందని హెచ్చరిస్తున్నారు.






# రాజీ మార్గమే రాజ మార్గం..

- రాజీ పడడానికి అవకాశం ఉన్న అన్ని కేసులలో రాజీ పడవచ్చు...
- జిల్లా ప్రధాన న్యాయమూర్తి, న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ రాజగోపాల్
- జిల్లా కోర్టు లోని న్యాయ సేవా సదన్ లో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి*

**ఖమ్మం బ్యూరో, మార్చి -28(తెలంగాణ ముచ్చట్లు)**

రాజీ మార్గమే రాజా మార్గమని, రాజీ పడదగ్గ కేసులలో రాజీ పడి సత్వర న్యాయం పొందాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ జి. రాజగోపాల్ అన్నారు. శనివారం జిల్లా కోర్టు లోని న్యాయ సేవా సదన్ లో జాతీయ లోక్ అదాలత్ ను జిల్లా ప్రిన్సిపల్ జడ్జి, న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ, లోక్ అదాలత్ లో రాజీతో ఇరువర్గాలు గెలిచినట్లేనని, లోక్ అదాలత్ తీర్పు, సుప్రీంకోర్ట్ తుది తీర్పుతో సమానమని అన్నారు. లోక్ అదాలత్ లను కక్షిదారులు సద్వినియోగం చేసుకోని త్వరితగతిన కేసులను పరిష్కరించుకోవాలని అన్నారు. రాజీ మార్గంలో కక్షిదారులు లోక్ అదాలత్ లను సద్వినియోగం చేసుకొని తమ కేసులను శాంతియుతంగా పరిష్కరించుకోవాలన్నారు. కేసులను రాజీతో ముగించేందుకు ఇలాంటి లోక్ అదాలత్ లు ఉపయోగపడతాయన్నారు. ఎలాంటి ఫీజు లేకుండా న్యాయ సేవా సంస్థ సహకారంతో కేసులను పూర్తి చేసుకోవచ్చని ఆయన తెలిపారు. కేసులు రాజీ చేసుకోవడం ద్వారా అప్పీలు చేసుకోవడం ఉండదని, కోర్టు చుట్టూ తిరిగితే సమయం, డబ్బు వృధా అవుతుందని, కేసుల పరిష్కారంతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని, లోక్ అదాలత్ ద్వారా కేసులను త్వరితగతిన పరిష్కరించుకోవాలని ప్రధాన న్యాయమూర్తి అన్నారు. కేసుల సత్వర పరిష్కారంతో ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మిద్దామని అన్నారు. కుటుంబ వివాదాల కేసులలో ముఖ్యమైనవి భార్యాభర్తల కేసుల వివాదాలలో ఇద్దరు కలిసి ఉంటే, వారి సంతానంతో పాటు ఇరువర్గాల కుటుంబాలు కూడా సుఖ సంతోషాలతో ఉండి, ఆరోగ్యమైన సమాజం ఏర్పడుతుందని తెలిపారు. గత లోక్ అదాలత్ లో 8490 కేసుల పరిష్కారం చేసి తెలంగాణ రాష్ట్రంలో ఖమ్మం జిల్లా 6వ స్థానంలో నిలిచిందన్నారు. ఇందులో 63 మోటారు వాహన ప్రమాదాల కేసులు పరిష్కరించి, 4 కోట్ల 28 లక్షల 98 వేల రూపాయలు పరిహారం క్రింద అందించామని ప్రధాన నాయమూర్తి తెలిపారు. ప్రస్తుత లోక్ అదాలత్ లో కేసుల పరిష్కారంలో జిల్లా ఇంకా మెరుగైన స్థానం సాధించాలన్నారు. ఇందుకు భాగస్వాములందరూ లక్ష్య సాధనకు శక్తివంచన లేకుండా కృషి చేయాలన్నారు. క్రిమినల్ కాంపౌండబుల్ కేసులు, సివిల్ తగాదా కేసులు, ఆస్తి విభజన కేసులు, వైవాహిక జీవితానికి సంబంధించిన కేసులు, బ్యాంక్ రికవరీ, విద్యుత్ చౌర్యం, చెక్ బౌన్స్ కేసులు, రోడ్డు ప్రమాదం, డ్రంక్ అండ్ డ్రైవ్, పెట్టి కేసులు, ఇతర రాజీపడ్డ దగిన కేసుల్లో కక్షిదారులు రాజీ పడాలని ప్రధాన న్యాయమూర్తి తెలిపారు. లోక్ అదాలత్ ద్వారా రాజీ మార్గంలో కేసుల పరిష్కారంతో కక్షిదారుల మధ్య సుహృద్భావ వాతావరణంతో పాటు, గ్రామాల్లో ప్రశాంతత నెలకొంటుందని ప్రధాన న్యాయమూర్తి తెలిపారు. లోక్ అదాలత్ లో ఒకరు గెలవడం, ఒకరు ఓడడం ఉండదని, ఇద్దరు విజేతలేనని ప్రధాన న్యాయమూర్తి అన్నారు. కార్యక్రమంలో జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షులు తొండపు వెంకటేశ్వర రావు మాట్లాడుతూ, భేషజాలకు పోకుండా, ఇరువర్గాల గెలుపు లోక్ అదాలత్ లో ఉంటుందని అన్నారు. పగ, ద్వేషం, కక్ష, ప్రతీకారం ఉంచుకోవద్దని, మనసును ప్రశాంతంగా ఉంచుకోవాలని, శత్రువునైనా ప్రేమించే తత్వం అలవర్చుకోవాలని తెలిపారు. లోక్ అదాలత్ ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా లోక్ అదాలత్ లో మోటార్ వాహన కేసుకు సంబంధించి ఇన్సూరెన్స్ కంపెనీ నుండి ప్రమాద మరణానికి సెటిల్ మెంట్ కు సంబంధించి, ఫ్యామిలీ కేసుకు సంబంధించి పరిష్కారం చేసి, అవార్డు తోపాటు పూల మొక్కలను జిల్లా ప్రధాన న్యాయమూర్తి బహుకరించారు. ఈ కార్యక్రమంలో మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి ఉమాదేవి, సీనియర్ సివిల్ జడ్జ్, న్యాయ సేవా సదన్ ఇంచార్జ్ కార్యదర్శి కల్పన, తెలంగాణ బార్ కౌన్సిల్ మెంబర్ శ్రీనివాసరావు, న్యాయమూర్తులు, న్యాయాధికారులు, న్యాయ సేవాధికార సంస్థ సభ్యులు, మీడియేటర్స్, న్యాయవాదులు, కక్షిదారులు, తదితరులు పాల్గొన్నారు.

# కళాకారులు దేవుని రూపాలు

కళాకారుడి కష్టాలు
కనుమరుగవుతున్న వేళ...
వేదికలు మూతపడితే
వాళ్ల ఊపిరి కూడా ఆగిపోతుంది;
చప్పట్లు లేకపోతే
మనసే మౌనమైపోతుంది...

కలలతో వచ్చిన వారు
కాలంతో పోరాడుతున్నారు;
కళను నమ్ముకున్న వారు
జీవితాన్ని మోస్తున్నారు...

ఒకప్పుడు వెలుగుల మధ్య
వెలిగిన ఆ ముఖాలు—
ఇప్పుడు గుర్తుల కోసం
గడపలు తడుతున్నాయి...



పాట పాడిన గొంతులు
పని కోసం తలవంచుతున్నాయి;
నాట్యం చేసిన పాదాలు
నడవడానికి కూడా
అలసిపోతున్నాయి...

ఇది వారి తప్పు కాదు,
ఇది కాలం మార్పు మాత్రమే;
కాని కళను మర్చిపోవడం
మన తప్పే కదా...

అందుకే—

రండి... కళాకారుడిని కాపాడుకుందాం,
రండి... కళను నిలబెట్టుకుందాం;
ఒక చప్పటి ఇచ్చినా
ఒక జీవితం నిలుస్తుంది...

ఒక చూపు చూసినా
ఒక ఆశ పుడుతుంది;
మన మద్దతు ఉంటేనే
వారి కళ బతుకుతుంది...



రచన: మంజుల పత్తిపాటి
మాజీ ఆలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్,
చరవాణి 9347042218
యాదాద్రి భువనగిరి జిల్లా
తెలంగాణ రాష్ట్రం

కనుమరుగవుతున్న ఈ వెలుగును
మళ్లీ వెలిగిద్దాం మనం;
కళాకారుడి జీవితం
మళ్లీ రంగస్థలం పై మెరవాలి
వారి కళ్లలో ఆనందం చూడాలని
కోరుకుంటూ..

# వెలుగుమట్లలో యుద్ధప్రాతిపదికన అభివృద్ధి పనులు...

- రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత జౌళి శాఖల మంత్రి వర్యులు తుమ్మల నాగేశ్వర రావు



**ఖమ్మం బ్యూరో, మార్చి - 28(తెలంగాణ ముచ్చట్లు):** వెలుగుమట్ల భూదాన్ భూముల్లో లబ్ధిదారులకు అన్ని సౌకర్యాలతో కూడిన మోడల్ కాలనీగా అభివృద్ధి చేసి పేదలకు గౌరవప్రదమైన జీవన వాతావరణం కల్పిస్తామని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖల మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. శనివారం వెలుగుమట్ల భూదాన్ భూముల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను మంత్రి, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, పోలీస్ కమిషనర్ సునీల్ దత్, మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి లతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కలెక్టర్ మ్యాప్ ద్వారా వివరిస్తూ కాలనీలో ఇప్పటికే విద్యుత్ స్తంభాల ఏర్పాటు, వీధి దీపాల పనులు పూర్తి అయ్యాయని, వాటర్ ట్యాంక్ నుండి ఇంటింటికీ త్రాగునీటి పైప్‌లైన్ అనుసంధానం జరుగిందని తెలిపారు. అలాగే అంతర్గత రోడ్ల నిర్మాణం, రవాణా సౌకర్యం కల్పించేలా ప్రణాళికలు సిద్ధం చేసినట్లు వివరించారు.

ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ ప్రజల మౌలిక అవసరాలను ప్రాధాన్యంగా తీసుకుని ప్రతి కుటుంబానికి త్రాగునీరు, విద్యుత్, రోడ్లు వంటి సదుపాయాలు సమగ్రంగా అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.

గత పది సంవత్సరాల కాలంలో పేదలు మౌలిక సదుపాయాల కొరతతో అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని, ఇందిరమ్మ ప్రభుత్వంలో ఆ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపిస్తున్నామని తెలిపారు. ప్రతి లబ్ధిదారుడికి నాణ్యమైన గృహ నిర్మాణం పూర్తి చేయించడమే లక్ష్యమని అన్నారు. వెలుగుమట్ల కాలనీలో విద్యుత్, త్రాగునీరు, రోడ్లు, కాలువలు, పారిశుద్ధ్య వ్యవస్థ వంటి అన్ని సదుపాయాలు సమగ్రంగా ఏర్పాటు చేసి ఆదర్శవంతమైన నివాస ప్రాంతంగా తీర్చిదిద్దుతామని మంత్రి స్పష్టం చేశారు. కాలనీలో స్కూల్, కమ్యూనిటీ హాల్, పార్క్ వంటి సామాజిక వసతులను కూడా అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. అంతర్గత రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణం యుద్ధప్రాతిపదికన పూర్తిచేయాలన్నారు. నెలలోపు డ్రెయిన్ల నిర్మాణం పూర్తి చేయాలని, వర్షాకాలం కాలనీలో నీటి నిలువ సమస్యలు ఉండకూడదని మంత్రి ఆదేశించారు. హౌసింగ్ శాఖ ఆధ్వర్యంలో లబ్ధిదారులు తమ ఇళ్ల నిర్మాణాన్ని వేగంగా పూర్తి చేసుకోవాలని మంత్రి సూచించారు. అధికారులందరూ సమన్వయంతో పని చేసి మిగిలిన పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని ఆదేశించారు. అభివృద్ధి పనుల పురోగతిపై మంత్రి సంతృప్తి వ్యక్తం చేస్తూ, నిర్దేశిత గడువులోనే అన్ని పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, ఖమ్మం మార్కెట్ కమిటీ చైర్మన్ హనుమంతరావు, ఆర్&బీ ఎస్ఈ యాకుబ్, హౌసింగ్ పీడీ భూక్యా శ్రీనివాస్, పబ్లిక్ హెల్త్ ఈఈ రంజిత్, ఖమ్మం ఆర్డీవో శ్రీనివాస్, తహసీల్దార్లు డి. జయచందర్, సైదులు, ప్రజాప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నోకియాలో భారీగా ఉద్యోగాల కోత..

**హెల్సింకి, మార్చి 28 (తెలంగాణ ముచ్చట్లు):** ఒకప్పుడు మొబైల్ ఫోన్ మార్కెట్‌ను ఏలిన ఫిన్‌లాండ్ టెక్ దిగ్గజం నోకియా ఇప్పుడు భారీ స్థాయిలో ఉద్యోగుల కోతకు సిద్ధమైంది. గ్లోబల్ పునర్వ్యవస్థీకరణ ప్రణాళికలో భాగంగా ప్రపంచవ్యాప్తంగా సుమారు 14,000 మంది ఉద్యోగులను తొలగించనున్నట్లు కంపెనీ ప్రకటించింది.

ఈ లేఆఫ్స్ ప్రభావం భారత్‌పైనా గణనీయంగా పడనున్నట్లు తెలుస్తోంది. భారత్‌లో కంపెనీ కార్యకలాపాలను బలోపేతం చేసే క్రమంలో నాయకత్వంలో కూడా కీలక మార్పులు చేసింది. ఏప్రిల్ 1 నుంచి సమర్ మిట్టల్ను ఇండియా కంట్రీ బిజినెస్ లీడర్‌గా, విభ మేహ్రాను ఇండియా కంట్రీ మేనేజర్‌గా నియమించింది. ఇప్పటి వరకు ఇండియా హెడ్‌గా ఉన్న తరుణ్ ఛబ్రా తన పదవి నుంచి తప్పుకున్నారు.

కంపెనీ అమ్మకాలు పడిపోవడం ఈ నిర్ణయానికి ప్రధాన కారణంగా కనిపిస్తోంది. 2025 నాలుగో త్రైమాసికంలో నోకియా నికర అమ్మకాలు సుమారు 15 శాతం తగ్గి 393 మిలియన్ యూరోల వద్ద నిలిచాయి. అలాగే, 2023లో క్లౌడ్ మరియు నెట్‌వర్క్ సర్వీసులను మొబైల్ నెట్‌వర్క్స్‌తో విలీనం చేయడం వల్ల ఉద్యోగాల్లో డూప్లికేషన్ పెరిగిందని కంపెనీ వర్గాలు తెలిపాయి. దీన్ని తగ్గించేందుకే ఈ భారీ స్థాయి తొలగింపులు చేపడుతున్నట్లు సమాచారం.




గత కొన్ని సంవత్సరాలుగా నోకియా తన సిబ్బంది సంఖ్యను క్రమంగా తగ్గిస్తూ వస్తోంది. 2018లో సుమారు 1,03,000 మంది ఉద్యోగులు ఉండగా, ప్రస్తుతం ఆ సంఖ్య 74,100కు తగ్గింది. భారత్‌లోనే సుమారు 17,000 మంది ఉద్యోగులు ఉన్నారు.

ఇదిలా ఉంటే, టెక్ రంగంలో ఉద్యోగాల కోతలు నోకియాకే పరిమితం కాలేదు. దాని ప్రధాన పోటీదారు ఎరిక్సన్ కూడా గత ఏడాది వేలాది మందిని తొలగించింది. అలాగే గూగుల్, మైక్రోసాఫ్ట్, మెటా వంటి దిగ్గజ సంస్థలు కూడా ఇప్పటికే భారీ లేఆఫ్స్ చేపట్టాయి.

మొత్తానికి, గ్లోబల్ ఆర్థిక పరిస్థితులు, టెక్నాలజీ రంగంలో మార్పులు కారణంగా కంపెనీలు ఖర్చులను తగ్గించే దిశగా అడుగులు వేస్తుండటం ఉద్యోగులపై తీవ్ర ప్రభావం చూపుతోంది.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక







# "కావ్యసుధ"కు మానస ఆర్ట్స్ ఉగాది ప్రతిభా పురస్కారం

**హైదరాబాద్,మార్చి 28 (తెలంగాణ ముచ్చట్లు):** వివిధ రంగాలకు చెందిన సాహితీ ప్రముఖులకు శ్రీ పరాభవనామ ఉగాది ప్రతిభా పురస్కారాల మహోత్సవం హైదరాబాద్‌లో ఘనంగా నిర్వహించారు. మానస ఆర్ట్ థియేటర్స్, జీఎస్ఆర్ అండ్ ఫ్రెండ్స్ ఈవెంట్స్ సంయుక్త ఆధ్వర్యంలో చిక్కడపల్లిలోని శ్రీ త్యాగరాజ గాన సభలో జరిగిన ఈ కార్యక్రమానికి ప్రముఖ విద్యావేత్త డాక్టర్ లలిత వాణి అధ్యక్షత వహించగా, మానస సలహాదారు బి ఎస్ రావు ముఖ్య అతిథిగా, ప్రముఖ కవయిత్రి డాక్టర్ పద్మా నాగరాజు విశిష్ట అతిథిగా హాజరయ్యారు.కవులు, రచయితలు, కళాకారులు సమాజ శ్రేయస్సుకు మార్గదర్శకులని ప్రముఖ రచయిత టి వి స్వామి పేర్కొన్నారు. మానస ఆర్ట్ థియేటర్స్ సంస్థ గత 43 సంవత్సరాలుగా సాహితీ సేవ చేస్తున్న ప్రముఖులను గుర్తించి దాదాపు 2000 మందికి సన్మానాలు నిర్వహించినట్లు సంస్థ ప్రధాన కార్యదర్శి రఘుశ్రీ వివరించారు.

శ్రీ పరాభవనామ సంవత్సర విశిష్టతను వివరించిన డాక్టర్ పద్మా నాగరాజు, ఈ సంవత్సరం శుభప్రదమని తెలిపారు. ఈ సందర్భంగా ప్రముఖ కవి, విశ్రాంత జర్నలిస్ట్, ఆధ్యాత్మిక సాహితీవేత్త "కావ్యసుధ"కు ఉగాది ప్రతిభా పురస్కారం అందజేశారు. తెలుగు సంప్రదాయ పద్ధతిలో తలపాగా, నారీకేళం, తాంబూలం, జత దోతులు, పూలమాల, శాలువాతో మెమెంటోతో ఘనంగా సత్కరించారు.అదేవిధంగా ప్రముఖ రచయిత్రి డాక్టర్ నర్మదా రెడ్డి, ఆధ్యాత్మికవేత్త సద్గురు దామోదరాచార్య, దర్శకుడు రాజ్ మురారి, రేడియో జాకీ మల్లేష్ తదితరులు కూడా ప్రతిభా పురస్కారాలు అందుకున్నారు.

పురస్కార గ్రహీత "కావ్యసుధ" స్పందిస్తూ గతంలో పొందిన పురస్కారం అనంతరం మళ్లీ 12 సంవత్సరాల తర్వాత ఈ గౌరవం దక్కడం ఆనందంగా ఉందని తెలిపారు. తన సాహితీ సేవలను గుర్తించి సత్కరించినందుకు సంస్థకు కృతజ్ఞతలు తెలిపారు. సంస్థ అధ్యక్షుడు బండారుపల్లి రామచంద్రరావు, గాయకుడు జి.ఎస్.ఆర్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం జరిగిన సినీ సంగీత కార్యక్రమంలో గాయనీ గాయకులు ఆలపించిన పాటలు సభికులను ఆకట్టుకున్నాయి.

# వెలుపలి కిటికీ..!

నీకేది అర్థం కానప్పుడు
నీరు కూడా మాట్లాడదు
దాహం నాలుక లాంటిదే
కాసేపు గొంతు తడుపుకొని
పైరును తడవుతుంది

దాహం
దేహం
దేశం

సమానత్వం
సార్వభౌమత్వం
సామ్యవాదం

మర్రిచెట్టుకు ఉన్న మహిమ తెలుసుకో
పాతబడ్డ మాటలన్నీ చెదలెక్కి పోయాకా



కొత్త మాటలకు ప్రాణమివ్వాలి
నీటికీ ఒక భాషనివ్వాలి .

**- మండాది గోపీనాథ్**
**ముక్కుడు దేవులపల్లి**



# భారత్–మాల్టా సంబంధాల బలోపేతంపై చర్చలు

- **ద్వైపాక్షిక సహకారానికి కొత్త దిశలు**
- **ప్రాంతీయ, అంతర్జాతీయ అంశాలపై అభిప్రాయ మార్పిడి**
- **రక్షణ సహకార విస్తరణపై కీలక చర్చలు**

**న్యూఢిల్లీ, మార్చి 28 (తెలంగాణ ముచ్చట్లు):** భారత విదేశాంగ మంత్రిత్వ శాఖకు చెందిన సెక్రటరీ (పశ్చిమ) సిబి జార్జ్ మాల్టా ఉప ప్రధానమంత్రి మరియు విదేశాంగ మంత్రిగా ఉన్న ఇయాన్ బోర్గ్‌ను కలిశారు. ఈ సందర్భంగా భారత్-మాల్టా మధ్య కొనసాగుతున్న సహకారాన్ని మరింత బలోపేతం చేయడానికి తీసుకోవాల్సిన చర్యలపై ఇద్దరు నేతలు విస్తృతంగా చర్చించారు. ఈ సమావేశంలో ద్వైపాక్షిక సంబంధాలను విస్తరించేందుకు అనేక కొత్త అవకాశాలపై చర్చ జరిగింది. వాణిజ్యం, పెట్టుబడులు, విద్య, సాంకేతికత వంటి రంగాల్లో భాగస్వామ్యాన్ని పెంచే దిశగా చర్చలు కొనసాగినట్లు సమాచారం. ఇరు దేశాలు పరస్పర సహకారాన్ని మరింత విస్తరించాలనే సంకల్పాన్ని వ్యక్తం చేశాయి.

అదేవిధంగా ప్రాంతీయ మరియు అంతర్జాతీయ అంశాలపై కూడా అభిప్రాయ మార్పిడి జరిగింది. ప్రస్తుత ప్రపంచ రాజకీయ పరిస్థితులు, భద్రతా సవాళ్లు, ఆర్థిక మార్పులు వంటి అంశాలపై ఇరు దేశాల ప్రతినిధులు తమ అభిప్రాయాలను పంచుకున్నారు. ఇంకా సెక్రటరీ (పశ్చిమ) సిబి జార్జ్ మాల్టా సాయుధ దళాల కమాండర్ క్లింటన్ జే. ఓ'నీల్ ను కూడా కలిశారు. ఈ సమావేశంలో రక్షణ రంగంలో సహకారాన్ని పెంపొందించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. రక్షణ, భద్రత రంగాల్లో పరస్పర సహకారాన్ని బలోపేతం చేయడం, సమాచార మార్పిడి, సంయుక్త శిక్షణ వంటి అంశాలు ఈ చర్చల్లో ప్రాధాన్యత పొందాయి. ఈ భాగస్వామ్యం ద్వారా ఇరు దేశాల భద్రతా వ్యవస్థలను మరింత బలోపేతం చేయాలని నిర్ణయించారు.

మొత్తంగా ఈ సమావేశాలు భారత్-మాల్టా సంబంధాలను మరింత దృఢంగా చేయడానికి కీలకంగా మారనున్నాయి. భవిష్యత్తులో ద్వైపాక్షిక సహకారం మరింత విస్తరించేందుకు ఈ చర్చలు మార్గదర్శకంగా నిలుస్తాయని అధికారులు భావిస్తున్నారు.

# రైతులకు 100 శాతం సబ్సిడీతో కూరగాయల విత్తనాల పంపిణీ





**వేలేరు, మార్చి 28 (తెలంగాణ ముచ్చట్లు):** వేలేరు మండల కేంద్రంలోని రైతు వేదికలో హార్టికల్చర్ శాఖ ఆధ్వర్యంలో రైతులకు 100 శాతం సబ్సిడీతో కూరగాయల విత్తనాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు, వేలేరు మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ బిల్లా యాదగిరి హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో పెద్ద మొత్తంలో నిధులను కేటాయిస్తున్నదని తెలిపారు. అలాగే ఎమ్మెల్యే కడియం శ్రీహరి సహకారంతో వేలేరు మండలంలో రైతులకు సబ్సిడీపై పలు వ్యవసాయ యంత్రాలను మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

అనంతరం సుమారు 130 మంది రైతులకు రూ.1 లక్ష 50 వేల విలువైన కూరగాయల విత్తనాలను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో హార్టికల్చర్ శాఖ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

# బీజేపీ ప్రశిక్షణ మహాభియాన్-2026 సన్నాహక సమావేశం నిర్వహణ

**స్టేషన్ ఘనపూర్,మార్చి28 (తెలంగాణ ముచ్చట్లు):** స్టేషన్ ఘనపూర్ మున్సిపాలిటీ కేంద్రంలోని మా గార్డెన్స్‌లో పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ ప్రశిక్షణ మహాభియాన్2026 సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి బీజేపీ మండల అధ్యక్షుడు సట్ల వెంకటరమణ గౌడ్ అధ్యక్షత వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా జనగామ జిల్లా అధ్యక్షుడు సౌడ రమేష్ హాజరయ్యారు. బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు, స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ ఇంచార్జి పెరుమాండ్ల వెంకటేశ్వర్లు పాల్గొని కార్యక్రమాన్ని ముందుకు నడిపించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి శిక్షణ కార్యక్రమాలు కీలకమని, ప్రశిక్షణ మహాభియాన్ ద్వారా కార్యకర్తలకు సిద్ధాంతాలు, కార్యాచరణపై స్పష్టత కల్పించబడుతుందని తెలిపారు. ప్రతి స్థాయిలో నాయకులు, కార్యకర్తలు చురుకుగా పాల్గొని పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి గుండె విజయరామారావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఉడుగుల రమేష్, రాష్ట్ర నాయకుడు బొజ్జపల్లి సుభాష్, పార్లమెంట్ కోకన్వీనర్ ఇనుగాల యుగేందర్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఐలోని అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. మండల పరిధిలోని రాష్ట్ర, జిల్లా, మండల నాయకులు, బూత్ అధ్యక్షులు, శక్తి కేంద్ర ఇంచార్జులు, వివిధ మోర్చాల నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు.





# మృతుల కుటుంబానికి బియ్యం అందజేత

**గూడూరు, మార్చి 28 (తెలంగాణ ముచ్చట్లు):** మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలంలోని ఏపూరు గ్రామం టేకులతండాకు చెందిన కాంగ్రెస్ యువ నాయకుడు అవుల సందీప్ రెడ్డి తల్లి ఆవుల రామ అనారోగ్యంతో మృతి చెందింది. ఈ నేపథ్యంలో ఉద్యమ నాయకుడు, ఎన్‌టివివిఎస్ రాష్ట్ర అధ్యక్షుడు బానోత్ రామన్న నాయక్ బాధిత కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశాడు.

ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు 50 కిలోల బియ్యం అందజేసి, ఇలాంటి క్లిష్ట సమయంలో తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని ధైర్యం చెప్పాడు. కుటుంబానికి మానసికంగా తోడ్పాటు అందించడం సమాజ బాధ్యత అని ఆయన పేర్కొన్నాడు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ సీనియర్ నాయకుడు బానోత్ చందా, కాంగ్రెస్ పార్టీ వార్డు సభ్యుడు బానోత్ ఈశ్వర్, మాజీ వార్డు సభ్యుడు బానోత్ జయరాం, ఎల్‌హెచ్‌పీఎస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బానోత్ చందు నాయక్, అజ్మీరా ఈశ్వర్, యువ నాయకులు బానోత్ తరుణ్, వంకుడోత్ సాగర్ తదితరులు పాల్గొన్నారు.

# ఝార్ఖండ్‌లో ఉపరాష్ట్రపతి తొలి పర్యటన

- **ఉలిహాటు గ్రామంలో బిర్సా ముండాకు నివాళులు**
- **సైనిక గౌరవంతో ఘన స్వాగతం**
- **గిరిజన ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి**

**ఝార్ఖండ్, మార్చి 28 (తెలంగాణ ముచ్చట్లు):** భారత ఉపరాష్ట్రపతి సి. పి. రాధాకృష్ణన్ తన పదవీ బాధ్యతలు స్వీకరించిన తరువాత మొదటిసారి ఝార్ఖండ్ రాష్ట్రాన్ని సందర్శించారు. ఈ పర్యటనలో భాగంగా ఖుంటి జిల్లాలోని ఉలిహాటు గ్రామానికి చేరుకుని, స్వాతంత్ర్య సమరయోధుడు బిర్సా ముండా జన్మస్థలాన్ని దర్శించి ఆయనకు ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమం దేశవ్యాప్తంగా ప్రాధాన్యత సంతరించుకుంది. ఉలిహాటు గ్రామం బిర్సా ముండా జన్మస్థలంగా చారిత్రాత్మక ప్రాధాన్యతను కలిగి ఉంది. ఆయన గిరిజనుల హక్కుల కోసం పోరాడిన మహనీయుడిగా గుర్తింపు పొందారు. బ్రిటీష్ పాలనకు వ్యతిరేకంగా ఆయన చేసిన పోరాటం భారత స్వాతంత్ర్య ఉద్యమంలో ఒక ముఖ్య అధ్యాయంగా నిలిచింది. ఉపరాష్ట్రపతి ఈ నేపథ్యంలో అక్కడికి వెళ్లి ఆయనకు నివాళులు అర్పించడం ప్రత్యేకంగా భావించబడుతోంది.

ఉపరాష్ట్రపతి గ్రామానికి చేరుకున్న వెంటనే స్థానిక ప్రజలు, అధికారులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. సంప్రదాయ రీతిలో గిరిజన కళారూపాలతో ఆయనకు ఆతిథ్యం ఇచ్చారు. గ్రామ ప్రజలతో కలిసిమెలిసి మాట్లాడిన ఆయన, వారి జీవన విధానాన్ని తెలుసుకునే ప్రయత్నం చేశారు. ఆయన రాక సందర్భంగా భద్రతా దళాలు గార్డు ఆఫ్ హానర్ అందజేశాయి. సైనిక గౌరవంతో జరిగిన ఈ స్వాగత కార్యక్రమం ఎంతో ఘనంగా సాగింది. అధికార యంత్రాంగం ఈ కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించింది. ఈ దృశ్యాలు అక్కడికి వచ్చిన ప్రజలను ఆకట్టుకున్నాయి. ఈ సందర్శన ద్వారా గిరిజన ప్రాంతాల అభివృద్ధి, సంక్షేమంపై కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందనే సంకేతాలు వెల్లడయ్యాయి. గిరిజనుల సామాజిక, ఆర్థిక పురోగతికి తీసుకుంటున్న చర్యలను మరింత బలోపేతం చేయాలనే సంకల్పం ఈ పర్యటనలో ప్రతిబింబించింది. మొత్తంగా ఉపరాష్ట్రపతి పర్యటన ఝార్ఖండ్ రాష్ట్రంలో ఉత్సాహాన్ని నింపింది. గిరిజన సమాజం పట్ల గౌరవం, వారి చరిత్ర పట్ల గుర్తింపు ఇవ్వడంలో ఈ సందర్శన ఒక కీలక ఘట్టంగా నిలిచింది. స్థానిక ప్రజలు ఈ పర్యటనను సంతోషంతో స్వాగతించారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్: బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



# ప్రభాస్ సినిమాపై కామెంట్స్.. క్లారిటీ ఇచ్చిన రాశి..!

సీనియర్ నటి రాశి ఇటీవల చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వివాదానికి దారితీయడంతో ఆమె స్వయంగా స్పందించి పూర్తి స్పష్టత ఇచ్చారు. ప్రభాస్ సినిమాలో తాను తల్లి పాత్ర చేయనని చెప్పినట్టు ప్రచారం జరుగుతుండటం పూర్తిగా తప్పు అని ఆమె తెలిపారు. తన మాటలను తప్పుగా అర్థం చేసుకుని వైరల్ చేసినందుకు విచారం వ్యక్తం చేశారు. ఇటీవల ఓ పాడ్‌కాస్ట్‌లో పాల్గొన్న రాశి, ప్రభాస్ అంటే తనకు చాలా ఇష్టమని, ఆయనతో కలిసి పని చేసే అవకాశం వస్తే తప్పకుండా చేస్తానని చెప్పారు. అయితే ఆ సందర్భంలో తల్లి పాత్రపై తాను చెప్పిన మాటలను కొంతమంది వక్రీకరించారని ఆమె పేర్కొన్నారు. "నేను ప్రభాస్‌కు తల్లి పాత్ర చేయనని ఎక్కడా చెప్పలేదు. పాత్రకు తగిన ప్రాముఖ్యత ఉంటే ఏ రోల్ అయినా చేయడానికి సిద్ధమే" అని రాశి స్పష్టం చేశారు. ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో అభిమానులు, నెటిజన్లు వివిధ రకాలుగా స్పందించారు. కొందరు ఆమెపై విమర్శలు గుప్పించగా, మరికొందరు ఆమెకు మద్దతుగా నిలిచారు. ఈ నేపథ్యంలో శుక్రవారం హైదరాబాద్‌లో జరిగిన 'అనుమాన పక్షి' సినిమా ఈవెంట్‌లో ఆమె ఈ వివరణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాశి మాట్లాడుతూ, తాను గతంలో ప్రభాస్ సినిమాలకు డబ్బింగ్ చెప్పినా, ఆయనను వ్యక్తిగతంగా కలిసే అవకాశం రాలేదని తెలిపారు. భవిష్యత్తులో ఆయనతో కలిసి పని చేసే అవకాశం వస్తే ఆనందంగా స్వీకరిస్తానని అన్నారు. ప్రభాస్ లాంటి పెద్ద స్టార్‌తో స్క్రీన్ షేర్ చేయడం ప్రతి నటికి ఒక మంచి అవకాశం అని ఆమె అభిప్రాయపడ్డారు. హీరోయిన్‌గా దాదాపు 148 సినిమాలు చేసిన అనుభవం తనకు ఉందని, ఆ అనుభవంతో చెప్పగలిగేది ఏమిటంటే మంచి కథ, బలమైన పాత్ర ఉంటే సినిమా తప్పకుండా విజయం సాధిస్తుందని రాశి అన్నారు. 'అనుమాన పక్షి' కూడా అలాంటి మంచి కంటెంట్‌తో రూపొందిందని, ప్రేక్షకుల నుంచి మంచి స్పందన వస్తుందని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు.

మొత్తానికి, ప్రభాస్ సినిమా విషయంపై వచ్చిన అపార్థాలకు తెరదిస్తూ రాశి ఇచ్చిన ఈ క్లారిటీ సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారింది. ఇక భవిష్యత్తులో ఆమెకు వచ్చే అవకాశాలు, ముఖ్యంగా పెద్ద స్టార్‌లతో కలిసి చేసే ప్రాజెక్టులు ఎలా ఉంటాయన్నది ఆసక్తిగా మారింది.

# సింపుల్‌గా పెళ్లి పీటలెక్కనున్న బెల్లంకొండ సాయి శ్రీనివాస్..!



టాలీవుడ్‌లో మరో యంగ్ హీరో పెళ్లి బంధంలోకి అడుగుపెట్టేందుకు సిద్ధమయ్యారు. ప్రముఖ నిర్మాత బెల్లంకొండ సురేష్ తనయుడు, హీరో బెల్లంకొండ సాయి శ్రీనివాస్ త్వరలో వివాహం చేసుకోనున్నారు. ఎలాంటి హడావిడి లేకుండా సింపుల్‌గా ఈ పెళ్లిని జరపాలని ఆయన నిర్ణయించుకున్నట్లు సమాచారం.

ఇటీవలే తనకు కాబోయే జీవిత భాగస్వామి కావ్య రెడ్డిని సాయి శ్రీనివాస్ అధికారికంగా పరిచయం చేశారు. ఆ సందర్భంగా ఇరు కుటుంబాలు కలిసిన వేడుక సాదాసీదాగా జరిగినప్పటికీ, అది నిశ్చితార్థం కాదని ఆయన స్పష్టం చేశారు. కేవలం కుటుంబ సభ్యుల మధ్య జరిగిన పరిచయ కార్యక్రమమేనని తెలిపారు.

ఇప్పుడు అధికారికంగా నిశ్చితార్థానికి తేదీ ఖరారైంది. ఏప్రిల్ 5న హైదరాబాద్లో సాయి శ్రీనివాస్‌కావ్యల ఎంగేజ్మెంట్ జరగనుంది. ఈ వేడుకను ఇరు కుటుంబాల పెద్దలు, అత్యంత సన్నిహితుల సమక్షంలో నిర్వహించనున్నారు. టాలీవుడ్‌కు చెందిన కొంతమంది ప్రముఖులకు కూడా ఆహ్వానం పంపనున్నట్లు తెలుస్తోంది.

వివాహ వేడుక విషయానికి వస్తే, ఏప్రిల్ 29న తిరుపతిలో సాదాసీదాగా పెళ్లి జరపాలని నిర్ణయించారు. ఏడుకొండల వాడి సన్నిధిలో ఈ జంట వివాహ బంధంతో ఒక్కటవనుంది. అనంతరం మే 1న హైదరాబాద్‌లో సినీ ప్రముఖుల కోసం గ్రాండ్ రిసెప్షన్ ఏర్పాటు చేయనున్నట్లు సమాచారం. ప్రస్తుతం సెలబ్రిటీ వెడ్డింగ్స్ అంటే డెస్టినేషన్ వెడ్డింగ్స్, ప్రీవెడ్డింగ్ పార్టీలు, బ్యాచిలర్ సెలబ్రేషన్స్ వంటి హంగామా ఎక్కువగా కనిపిస్తున్న వేళ, సాయి శ్రీనివాస్ మాత్రం సింపుల్ వెడ్డింగ్‌ను ఎంచుకోవడం సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. కావ్య రెడ్డి విషయానికి వస్తే, ఆమెకు సినీ రంగంతో ఎలాంటి సంబంధం లేదు. ప్రముఖ న్యాయవాది కుమార్తె అయిన ఆమెతో సాయి శ్రీనివాస్ కొంతకాలంగా ప్రేమలో ఉన్నట్లు సమాచారం. కుటుంబ సభ్యుల సమ్మతితో ఇప్పుడు వివాహం చేసుకోబోతున్నారు. ఇటీవల జరిగిన చిన్న వేడుకకు సంబంధించిన ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఇక సినిమాల పరంగా చూస్తే, గతేడాది విడుదలైన 'భైరవం', 'కిష్కింధపురి' చిత్రాలతో మంచి విజయాలు అందుకున్న సాయి శ్రీనివాస్ ఈ ఏడాది కూడా వరుస ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు. పలు దర్శకులతో కలిసి 'హైందవ', 'రామమ్', 'టైసన్ నాయుడు' వంటి సినిమాల్లో నటిస్తున్నారు. త్వరలో ఈ చిత్రాలకు సంబంధించిన మరిన్ని అప్డేట్స్ రానున్నాయి. మొత్తానికి, సింపుల్‌గా పెళ్లి చేసుకోవాలనే సాయి శ్రీనివాస్ నిర్ణయం అభిమానులను ఆకట్టుకుంటోంది. ఆయన కొత్త జీవితానికి అడుగుపెట్టబోతుండటంతో సినీ వర్గాలు, అభిమానులు శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు.




# బరిలోకి వరుణ్ తేజ్.. తెలుగులోనే సత్తా చూపిస్తానన్న డైరెక్టర్

మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ హీరోగా, ఆయన సోదరి నిహారిక కొణిదెల నిర్మాణంలో తెరకెక్కుతున్న తాజా చిత్రం 'బరి' శనివారం ఘనంగా ప్రారంభమైంది. పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ పతాకంపై రూపొందుతున్న ఈ చిత్రానికి యువ దర్శకుడు యదు వంశీ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ ముఖ్య అతిథిగా హాజరై చిత్ర యూనిట్‌ను ఆశీర్వదించారు.

పూజా కార్యక్రమాలు అట్టహాసంగా నిర్వహించగా, ముహూర్తపు సన్నివేశానికి పవన్ కళ్యాణ్ క్లాప్ కొట్టడం ఈ వేడుకకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. తన బిజీ షెడ్యూల్ మధ్య కూడా హాజరైనందుకు పవన్ కళ్యాణ్‌కు వరుణ్ తేజ్ కృతజ్ఞతలు తెలిపారు. మెగా ఫ్యామిలీ మొత్తం ఒకే వేదికపై కనిపించడంతో ఆ ఫోటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

ఈ సందర్భంగా దర్శకుడు యదు వంశీ చేసిన వ్యాఖ్యలు సినీ వర్గాల్లో చర్చనీయాంశమయ్యాయి. స్పోర్ట్స్ డ్రామాలు అంటే మలయాళ సినిమాల వైపు చూసే పరిస్థితి ఉందని, కానీ తెలుగు చిత్ర పరిశ్రమలో కూడా బలమైన కంటెంట్‌తో గొప్ప సినిమాలు తీసే సామర్థ్యం ఉందని ఆయన స్పష్టం చేశారు. మన సంస్కృతి, మన భావోద్వేగాలను ప్రతిబింబించేలా 'బరి' సినిమాను రూపొందిస్తున్నామని తెలిపారు. 'కమిటీ కుర్రోళ్లు' చిత్రంతో గుర్తింపు పొందిన యదు వంశీ, ఈసారి రూరల్ స్పోర్ట్స్ డ్రామాగా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఇందులో వరుణ్ తేజ్ వాలీబాల్ ప్లేయర్ పాత్రలో కనిపించనుండటం విశేషం. గ్రామీణ నేపథ్యం, క్రీడా స్ఫూర్తి, భావోద్వేగాలతో ఈ సినిమా ప్రేక్షకులను కొత్త అనుభూతికి గురి చేస్తుందని చిత్ర యూనిట్ నమ్మకం వ్యక్తం చేస్తోంది.

సంక్రాంతి 2027 కానుకగా ఈ చిత్రాన్ని విడుదల చేయాలని మేకర్స్ ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. వరుణ్ తేజ్ - నిహారిక కొణిదెల - యదు వంశీ కాంబినేషన్‌లో వస్తున్న ఈ ప్రాజెక్ట్‌పై ఇప్పటికే మంచి అంచనాలు నెలకొన్నాయి.



# నాగార్జునకు జోడీగా ఐశ్వర్య రాజేష్..?

కింగ్ నాగార్జున తన 100వ చిత్రాన్ని భారీగా ప్లాన్ చేస్తున్న నేపథ్యంలో హీరోయిన్ ఎంపికపై ఆసక్తికర చర్చలు మొదలయ్యాయి. ఈ సినిమాలో ఆయనకు జోడీగా ఐశ్వర్య రాజేష్ నటించనున్నారనే వార్తలు సినీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారాయి.

గతేడాది 'కుబేర', 'కూలీ' వంటి చిత్రాలతో ప్రేక్షకులను అలరించిన నాగార్జున, ఈ సినిమాల్లో నెగెటివ్ షేడ్స్ ఉన్న పాత్రల్లో కనిపించడం విశేషం. ముఖ్యంగా విలన్‌గా ఆయన నటనకు మంచి స్పందన వచ్చినప్పటికీ, అభిమానులు మాత్రం నాగ్‌ను మళ్లీ పూర్తి స్థాయి హీరోగా చూడాలని ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

ఈ నేపథ్యంలో దర్శకుడు రా కార్తీక్‌తో కలిసి నాగార్జున ఓ కొత్త సినిమా చేయడానికి సిద్ధమయ్యారు. 'లాటరీ కింగ్' అనే టైటిల్‌ను పరిశీలిస్తున్న ఈ చిత్రం ఆయన కెరీర్‌లో 100వ సినిమాగా ఉండటంతో మేకర్స్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు.

ఇప్పటికే ఈ సినిమాలో సీనియర్ నటి టబు నటిస్తారనే వార్తలు వినిపించగా, ఇప్పుడు హీరోయిన్‌గా ఐశ్వర్య రాజేష్ పేరు బలంగా వినిపిస్తోంది. 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమాలో వెంకటేశ్ సరసన నటించి మంచి గుర్తింపు పొందిన ఐశ్వర్య, ఇప్పుడు నాగార్జునకు జోడీగా ఎంపికయ్యారనే టాక్ చక్కర్లు కొడుతోంది. తెలుగమ్మాయి అయినప్పటికీ తమిళంలో ఎక్కువ సినిమాలు చేసిన ఐశ్వర్య రాజేష్, ఇటీవల తెలుగులోనూ వరుస అవకాశాలు అందుకుంటోంది. అయితే 'సంక్రాంతికి వస్తున్నాం' తర్వాత పెద్దగా ఆఫర్లు రాకపోవడంతో, నాగార్జున 100వ సినిమాలో అవకాశం వస్తే అది ఆమెకు గోల్డెన్ ఛాన్స్‌గా మారే అవకాశం ఉందని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు. ఇక ఈ వార్తలపై అధికారిక ప్రకటన ఇంకా రాలేదు. త్వరలోనే మేకర్స్ క్లారిటీ ఇవ్వనున్నారని సమాచారం. నాగార్జున 100వ సినిమా కావడంతో ఈ ప్రాజెక్ట్‌పై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. హీరోయిన్ ఎంపికతో పాటు మిగతా నటీనటుల వివరాలు బయటకు వస్తే ఈ సినిమా మరింత హైప్ అందుకోవడం ఖాయం.



# ఆ సినిమా పైనే ఆశలు పెట్టుకున్న వైష్ణవి.. హిట్ పడితేనే..!

సోషల్ మీడియా ద్వారా గుర్తింపు తెచ్చుకుని సినిమాల్లో అవకాశాలు దక్కించుకున్న కొత్త తరం హీరోయిన్లలో వైష్ణవి చైతన్య ఒకరు. యూట్యూబ్ వీడియోలు, షార్ట్ ఫిలిమ్స్‌తో తన కెరీర్ ప్రారంభించిన ఈ యువ నటి, తన సహజమైన నటనతో ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించింది.

మొదట చిన్న చిన్న పాత్రలతో సినిమాల్లో కనిపించిన వైష్ణవి, తరువాత హీరోయిన్‌గా అవకాశాలు అందుకుని తన ప్రతిభను చాటుకుంది. ముఖ్యంగా బేబీ సినిమాతో ఆమెకు పెద్ద బ్రేక్ వచ్చింది. సాయి రాజేష్ దర్శకత్వంలో, ఆనంద్ దేవరకొండ హీరోగా తెరకెక్కిన ఈ చిత్రం అంచనాలకు మించి విజయం సాధించి, వైష్ణవికి మంచి గుర్తింపు తెచ్చిపెట్టింది.

అయితే ఆ సినిమా తర్వాత చేసిన లవ్ మీ మాత్రం ఆశించిన ఫలితాన్ని ఇవ్వలేకపోయింది. దీంతో ఇప్పుడు ఆమె కెరీర్ కొంత కీలక దశలో నిలిచింది. ప్రస్తుతం వైష్ణవి నటిస్తున్న ఎపిక్ సినిమా ఆమెకు చాలా ముఖ్యమైంది. ఈ చిత్రం షూటింగ్ వేగంగా కొనసాగుతుండగా, ఇదే తన కెరీర్‌ను మళ్లీ ట్రాక్‌లో పెట్టే ప్రాజెక్ట్‌గా ఆమె భావిస్తున్నట్లు తెలుస్తోంది.

ఈ సినిమా హిట్ అయితే వైష్ణవికి మరిన్ని అవకాశాలు వరుసగా వచ్చే అవకాశముందని సినీ వర్గాలు భావిస్తున్నాయి. లేకపోతే కెరీర్‌లో మరోసారి వెనుకడుగు పడే ప్రమాదం కూడా ఉందని విశ్లేషకులు అంటున్నారు. ప్రస్తుతం ఆమె చేతిలో పెద్దగా ప్రాజెక్టులు లేకపోవడంతో, ఈ ఒక్క సినిమాపైనే పూర్తి ఆశలు పెట్టుకున్నట్లు సమాచారం.

ఇక సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండే వైష్ణవి, తరచూ తన ఫోటోలు, వీడియోలతో అభిమానులను అలరిస్తోంది. గ్లామర్‌తో పాటు సంప్రదాయ లుక్స్‌లోనూ కనిపిస్తూ యువతను ఆకట్టుకుంటోంది. మొత్తానికి, 'ఎపిక్' ఫలితం వైష్ణవి కెరీర్‌ను ఏ దిశగా తీసుకెళ్తుందో చూడాల్సి ఉంది.

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in